www.flashindianews.com

FLASH INDIA NEWS

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

17 సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 126 | శుక్రవారం 19.06.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




# కేంద్రం భారీ స్కెచ్

## కోటా 850 సీట్లు మహిళా బిల్లుకు ప్లాన్

- తెరవెనుక కేంద్రం భారీ స్కెచ్.. ఐదు రాష్ట్రాల ఎన్నికలతో మారిన సీన్
- దీదీ నుంచి దూరంగా టీఎంసీ ఎంపీలు..
- వీరంతా బీజేపీకి మద్దతిచ్చే అవకాశాలే ఎక్కువ
- గతంలో 54 ఓట్లు తక్కువ రావడంతో వీగిపోయిన బిల్లు
- ఈ సారి పక్కా ప్లాన్తో డీలిమిటేషన్, మహిళా బిల్లుపెట్టే చాన్స్
- ఉత్తర-దక్షిణ భారతం మధ్య అతిపెద్ద అగాధం
- సమూలంగా మారిపోనున్న భారత రాజకీయ ముఖచిత్రం
- మేధావులు, రాజకీయవర్గాల్లో ఎడతెగని ఊహాగానాలు

03

భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అతి పెద్ద వ్యూహాన్ని కేంద్రంలోని బీజేపీ భ ప్రభుత్వం రచిస్తోందా అంటే రాజకీయ వర్గాలు, అనలిస్టుల నుంచి అవుననే సమా ధానమే వినిపిస్తోంది. ఈ మధ్య జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో బీజేపీ బలం పెరగడం, దీనికి తోడు బెంగాల్లో దీదీని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలంతా మోదీకి అనుకూలంగా మారడం కేంద్రానికి కలిసివస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకుని ఇటీవల వీగిపోయిన బిల్లులను మళ్లీ పట్టాలెక్కించే పనిలో కాషాయవర్గం వ్యూహాలు రచిస్తున్నట్టు ఢిల్లీ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇదే నిజమైతే ఉత్తరదక్షిణ భారతం మధ్య అతిపెద్ద అగాధం ఏర్పడనుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# ఈ క్యాబినెట్ కు గ్రీన్ సిగ్నల్



## జూన్ 21న నీట్ పరీక్షకు ఉచిత ప్రయాణం

- రూ.2 కోట్లతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ఆమోదం
- ఎక్కడి నుంచైనా క్యాబినెట్ అజెండా పరిశీలించే అవకాశం
- జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదలకు క్యాబినెట్ ఆమోదం
- మధిర సభ వేదికగా రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం
- వీజీఆర్ఎం అంశంపై క్యాబినెట్ ఫోకస్
- సమగ్ర అధ్యయనం తర్వాతే తుది నిర్ణయం

02

తెలంగాణ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో డిజిటల్ క్యాబినెట్ వ్యవస్థ అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, మంత్రివర్గ సమావేశాలను పూర్తిగా పేపర్‌లెస్ విధానంలో నిర్వహించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది.

# షెడ్యూల్ విడుదల చేయండి



## ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ విడుదల చేయండి

- 30 నెలల్లో రూ.1,078 కోట్లతో 2,815 కొత్త బస్సుల కొనుగోలు
- ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కీలక నిర్ణయాలు
- కొత్త డిపోలు, బస్ స్టేషన్లతో సేవల విస్తరణకు చర్యలు
- బకాయిల భారం తగ్గించి ఆర్థిక స్థితి మెరుగుదలకు ఫోకస్
- కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- జూలై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయనున్న ప్రభుత్వం
- మహిళా సంఘాలకు 553 బస్సులు.. సాధికారతకు కొత్త ఊతం
- ఎలక్ట్రిక్ బస్సుల పనితీరుపై సమగ్ర నివేదిక కోరిన మంత్రి


02

# నీట్ నుంచి యూపీఎస్‌సీ వరకు..

కుటుంబాల పై రూ.3.5 లక్షల కోట్ల భారం

- పోటీ పరీక్షలతో కుటుంబాలపై భారీ భారం
- విద్యా వ్యవస్థపై రాహుల్ గాంధీ విమర్శలు
- నీట్ కోచింగ్‌కే రూ.1.32 లక్షల కోట్లు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు?
- తల్లిదండ్రుల పొదుపులు కరిగిపోతున్నాయ్

05




# బీఆర్ఎస్ మనుగడ నా వల్లే

## పార్టీ విలీనాన్ని అడ్డుకున్నది నేనే

- బీఆర్ఎస్ మనుగడపై కవిత సంచలన వ్యాఖ్యలు
- బీసీ రిజర్వేషన్లపై పోరాటమే విభేదాలకు కారణం
- నన్ను పార్టీలో నుంచి పంపించేశారు
- పార్టీలో పక్షపాతం, అవమానం ఎదురైంది
- కేటీఆర్ విషయంలో స్పందించారు.. నాపై మౌనం ఎందుకు?
- సొంత రాజకీయ ప్రయాణానికే నిర్ణయం

02



# కుట్రలతోనే 2018లో ఓడా..



## హైడ్రా పేదల కోసం కాదు.. కబ్జాదారుల కోసం

కుట్రలు చేశారే గానీ.. గెలుపు ఆపలేక పోయారు

కాలుష్య రహిత హైదరాబాద్ కోసం విస్తృత హరితహారం


ఎల్బీనగర్ అంటే సొంతూరి అనుభూతి

ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు

- నన్ను ఓడించేందుకు కుట్రలు చేసినా ప్రజలే గెలిపించారు: సీఎం
- ఎల్బీనగర్ ప్రజల రుణం తీర్చేందుకే ఎకో పార్క్
- మల్కాజ్‌గిరి విజయంతోనే రాజకీయంగా ఎదిగా
- 2018 ఓటమి నుంచి సీఎంగా ఎదిగిన ప్రయాణం
- ఎల్బీనగర్ అంటే సొంతూరి అనుభూతి
- ప్రజల అండతోనే సీఎం కుర్చీ దక్కింది
- హైడ్రా పేదల కోసం కాదు.. కబ్జాదారుల కోసం
- ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు హెచ్చరిక
- కబ్జాలపై ఉక్కుపాదం మోపనున్న ప్రభుత్వం
- కాలుష్య రహిత హైదరాబాద్ కోసం విస్తృత హరితహారం
- మూసీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ ఫైర్
- ప్రజల భద్రతే మూసీ పునరుజ్జీవన లక్ష్యం

03

# టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'..



- టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు
- కొత్త డార్క్‌వెబ్‌గా మారిందా?
- నీట్ పేపర్ లీక్‌లకు వేదికగా ఛానెళ్లు
- సైబర్ మోసగాళ్లకు సేఫ్ జోన్?
- హ్యాకర్లు, తీవ్రవాద గ్రూపుల అడ్డాగా ఆరోపణలు
- ప్రైవసీ ఫీచర్లే దర్యాప్తుకు అడ్డంకి!
- పిల్లలపై నేర కంటెంట్ సర్క్యులేషన్‌పై ఆందోళన
- మనీలాండరింగ్ ఖాతాల విక్రయాలు ఓపెన్‌గా?
- దేశ భద్రతకు ముప్పంటూ కేంద్రం అఫిడవిట్
- టెలిగ్రామ్‌పై నిషేధమా.. కొత్త గైడ్‌లైన్సా?
- మెసేజింగ్ యాప్ నుంచి డేంజరస్ నెట్‌వర్క్‌గా?

05

నీట్ లీక్‌ల నుంచి సైబర్ మోసాల దాకా!

# పెట్రో ధరల తగ్గింపు ఉండదు

## ఇప్పుడే కుదరదన్న కేంద్ర మంత్రి

- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న కేంద్ర మంత్రి సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం

07



# 500 కిలోల గంజాయి స్వాధీనం



- ఒడిశా నుంచి తెలంగాణకు గంజాయి సరఫరాపై భారీ దెబ్బ
- హైరిస్క్ ఆపరేషన్‌లో భారీ డ్రగ్స్ పట్టివేత
- 115 ప్యాకెట్లలో తరలిస్తున్న గంజాయి స్వాధీనం
- అడవి ప్రాంతంలో వాహనం వదిలి డ్రైవర్ పరార్
- 80 కిలోమీటర్ల చేజింగ్ తర్వాత గంజాయి పట్టివేత

02

# షెడ్యూల్ విడుదల చేయండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2023-26 మధ్యకాలంలో ప్రజా పాలన ప్రభుత్వం రూ.1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. అలాగే ఏటూరు నాగారం, పెద్దపల్లి ప్రాంతాల్లో రెండు కొత్త డిపోలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని ప్రాథమిక వైద్య సేవల స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. వీరిలో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని వివరించారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సీఎస్ఎస్ బకాయిలు రూ.1,096.90 కోట్ల నుంచి రూ.862 కోట్లకు తగ్గాయని, పీఎఫ్ బకాయిలు రూ.2,018.15 కోట్ల నుంచి రూ.1,714.39 కోట్లకు తగ్గాయని తెలిపారు. అలాగే ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలను కూడా రూ.493.02 కోట్ల మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీసు నుంచి తొలగించబడిన 490 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకున్నామని, మిగిలిన కేసులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. మహాలక్ష్మీ పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అందిస్తున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అవి ఏ రూట్లలో నడుస్తున్నాయి, లాభదాయక రూట్లు ఏవి, నష్టాలు వస్తున్న మార్గాలు ఏవి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు, 38,128 మంది ఉద్యోగులు ఉండగా, ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించి సుమారు 61 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులు వేగవంతం చేయాలని, ములుగు బస్ స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్‌లకు శంకుస్థాపన నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మునుగోడు, చండూరు, మర్రిగూడ బస్ స్టేషన్‌ల పునరుద్ధరణ పనులు, నాంపల్లి బస్ స్టేషన్ స్థల పరిశీలనపై సమీక్ష నిర్వహించారు. మధిర బస్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలని, మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్‌లకు త్వరలో శంకుస్థాపనలు నిర్వహించాలని సూచించారు. గోదావరిఖని బస్ స్టేషన్‌ను వాణిజ్యపరంగా మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు. మంచిర్యాల ,చెన్నూరు ,మెదక్ , బెల్లంపల్లి , పరకాల , ములకనూరు ,ధర్మపురి ,మక్తల్ బస్ స్టేషన్ లను అధికారులు ప్రత్యేకంగా విజిట్ చేసి అవసరమైన చోట బస్ స్టేషన్ ల నిర్మాణం, రెనోవేషన్ పై నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల అధికారితో చర్చించి సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల నుంచి సేకరించిన నిధులతో త్వరలో రూ.1 కోటి చెక్కు అందజేయడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం కింద ఇప్పటివరకు 11 కేసులను పరిష్కరించి ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున చెక్కులు అందించినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ, ఈవీ విధానం, ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణపై దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌ల అభివృద్ధికి అవసరమైన భూ బదలాయింపు ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఈడి లు ,ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మనుగడ నా వల్లే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ మనుగడలో ఉందంటే అది నా వల్లేనన్నారు. నేను జైల్లో ఉన్నప్పుడు పార్టీని బీజేపీలో విలీనం చేయాలనుకుంటున్నామనే ప్రతిపాదనతో కొంతమంది నా వద్దకు వచ్చారని కానీ నేను అలా చేయవద్దని స్ట్రాంగ్‌గా నిలబడ్డానని చెప్పారు. నేను ఏ తప్పు చేయలేదని ఏదో ఒకరోజు బెయిల్‌పై బయటకు వస్తానని పార్టీని త్యాగం చేయవద్దని వారితో చెప్పినట్లు తెలిపారు. తాజాగా ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన కవిత.. ఇవాళ ఆ పార్టీ నేతలు వచ్చి ఏది పడితే అది మాట్లాడుతుండవచ్చు కానీ పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి నేను సిద్ధం అని పార్టీతో చెప్పానన్నారు. పార్టీ ఓటమికి తానే కారణం అని వస్తున్న ఆరోపణలను కవిత ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చర్చ అంతా ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని కానీ బీఆర్ఎస్ మాత్రం ఈ విషయాన్ని అంగీకరించడం లేదన్నారు. బీఆర్ఎస్ లో తాను పక్షపాతాన్ని, అవమానాన్ని చవి చూశానన్నారు.

**బీఆర్ఎస్‌తో విభేదాలకు అది కూడా ఓ కారణం:**

బీఆర్ఎస్ పార్టీ నుంచి తాను బయటకు రాలేదని తనను బయటకు పంపించేశారని కవిత అన్నారు. అంతర్గతంగా గొడవలు జరుగుతూనే ఉండేవని అయితే నేను ఎప్పుడూ వాటిని పరిష్కరించుకోవాలనే కోరుకున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని చెడ్డ పనులే చేయలేదని కానీ ప్రధానమైన హామీలు నెరవేర్చకపోవడం లోటుగానే ఉండేదన్నారు. తాను జైలుకు వెళ్లడానికి కొన్ని రోజుల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఉద్యమానికి బలంగా మద్దతు ఇచ్చారు. ఇది బీఆర్ఎస్ పార్టీతో విభేదాలకు ప్రధాన కారణాలలో ఒకటి అన్నారు. బీసీ ఉద్యమానికి మద్దతు ఆపాలని ఒత్తిడి వచ్చింది. కానీ ఈ దేశంలో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా అనేది తప్పకుండా జరగాలని బలంగా నమ్మానన్నారు. ఈ విషయంలో తాను మాట్లాడుతుండగా ఒక రోజు నా వివరణ తీసుకోకుండానే నన్ను పార్టీలో నుంచి సస్పెండ్ చేశారన్నారు. వెంటనే పార్టీ నుంచి సంక్రమించిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు.

**నాముందున్న ఏకైక మార్గం అదే**

అనంతరం తాను ప్రజాజీవితంలో కొనసాగాలని నిర్ణయించుకున్నాను. ఒకవేళ ప్రజావితంలో కొనసాగాలంటే రాజకీయాల కంటే ఉత్తమమైన మార్గం మరొకటి లేదు. దీంతో తన ముందు ఉన్న మార్గాల గురించి ఆలోచించాను. బీజేపీ విషయానికొస్తే వాళ్లు తెలంగాణ కోసం అసలు ఏమీ చేస్తారని అనిపించడం లేదని, కాంగ్రెస్ పని తీరు ప్రస్తుతం ఎంత దారుణంగా ఉందో మనం చూస్తూనే ఉన్నామన్నారు. బీఆర్ఎస్ ఆప్షన్ కాదు. అందువల్ల నేను సొంతంగా బయలుదేరడమే నాకు మిగిలిన ఏకైక మార్గం అన్నారు. నన్ను జైలుకు పంపడానికి మూడు సంవత్సరాల ముందు బీజేపీ సోషల్ మీడియా నన్ను దారుణంగా వేధించిందని చెప్పారు. బతుకమ్మ పండగను నేను చాలా పవిత్రంగా ఆచరిస్తానని ఆ 9 రోజులు నేను ఉపవాస దీక్షలో ఉంటాను. కానీ బీజేపీ సోషల్ మీడియా నేను బతుకమ్మ పెట్టుకునే తలమీద మద్యం సీసాలు పెట్టి ఫోటోలను మార్ఫింగ్ చేస్తే పార్టీ స్పందించలేదన్నారు. తనపై వస్తున్న వేధింపులపై పార్టీ నాయకత్వం స్పందించాలని నేను అభ్యర్థించినా వారు స్పందించలేదన్నారు.

**జైలు నుంచి బయటకు వచ్చాక కూడా..**

బెయిలుపై బయటకు వచ్చాక కూడా గులాబీ కండువా వేసుకునే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కోసం పని చేసినట్లు కవిత చెప్పారు. నా వైపు నుండి నేను ఏ తప్పూ చేయలేదు. కానీ వాళ్లకు ఏమినచ్చలేదో నాకు తెలియదు. నా పని నేను చేసుకుంటుండగా ఒక రోజు నన్ను పార్టీ నుండి సస్పెండ్ చేశారన్నారు. పార్టీ కేటీఆర్‌ను ప్రమోట్ చేయాలనుకుందేమో అందుకే కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీ మొత్తం స్పందించింది. దాంతో పార్టీలోని అందరికీ ఒకే రకమైన స్పందన ఎందుకు ఇవ్వడం లేదని నేను అడిగానన్నారు. బీజేపీ నన్ను తప్పుడు ఆరోపణలతో వేధిస్తుంటే ఈ విషయంలో మాట్లాడలేదు కానీ కేటీఆర్ విషయంలో స్పందించారని, దీంతో చివరకు ఇది పితృస్వామ్యం అని నేను అనుకున్నానన్నారు. తిరిగి కేసీఆర్ వెనక్కి రమ్మని పిలిచినా ఇప్పుడు నేను వెళ్లలేనని స్పష్టం చేశారు.

**పవన్ కల్యాణ్‌పై..**

తెలంగాణలో పవన్ కల్యాణ్ పోటీ చేయడాన్ని మేము ఎప్పుడూ వ్యతిరేకించలేదని ఆయన ధ్వంధ్వ వ్యాఖ్యలనే వ్యతిరేకిస్తున్నామన్నారు. తమను హైదరాబాద్‌కు రానివ్వడం లేదని జాతీయ మీడియాలో చెబుతున్న పవన్ కల్యాణ్.. వారానికి మూడు రోజులు హైదరాబాద్‌లోనే ఉంటున్నారన్నారు. ఆయనే కాదు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా వారంలో 2 రోజులు ఇక్కడే ఉంటున్నారు. రాష్ట్రం ఏర్పడితే 11 రోజులు అన్నం ముట్టలేదని చెప్పిన పవన్ కల్యాణ్.. తెలంగాణ వ్యతిరేకి అని మేము బలంగా నమ్ముతున్నామన్నారు. రాజకీయ చైతన్యం కలిగిన తెలంగాణ ప్రజలు పవన్ కల్యాణ్ ను ఓడిస్తారన్నారు. తెలంగాణ ప్రాంతీయ వాదాన్ని ఉగ్రవాదంతో పోలుస్తున్నారు. మమ్మల్ని రెచ్చగొట్టడానికి మీరు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడని మండిపడ్డారు. పోటీ చేయాలనుకుంటే పోటీ చేయనివ్వండి కానీ మా ఉద్యమాన్ని అవమానించ వద్దన్నారు. ఆయన పోటీ చేయాలనే ఉద్దేశం అతడికి లేదని కేవలం గొడవ సృష్టించాలనే ఉద్దేశ్యంతోనే ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏపీ, తెలంగాణ నీటి పంపకాల్లో సమస్య తలెత్తితే పవన్ కల్యాణ్ ఎటువైపు నిలబడతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎంవోయూల సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఒప్పందాలు కుదుర్చుకోవడం తప్ప ప్రజలకు చేసేదేమి లేదని చెప్పుకొచ్చారు.

## 500 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఒడిశా నుంచి తరలిస్తున్న 500 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని బలిమేళా నుంచి జయపూర్ వరకు దాదాపు 80 కిలోమీటర్ల మేర బొలెరో వాహనాన్ని ఈగల్ ఫోర్స్ బృందం వెంబడించింది. అడవి ప్రాంతంలో వాహనాన్ని నిలిపివేసినా డ్రైవర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 115 ప్యాకెట్లలో గంజాయి లభించింది. స్వాధీనం చేసుకున్న గంజాయిలో 90 ప్యాకెట్లు 5 కిలోల చొప్పున, మరో 25 ప్యాకెట్లు 2 కిలోల చొప్పున ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు బొలెరో వాహనాన్ని ఒడిశాలోని కొరాపుట్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న వాహనం ఒడిశాలోని నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన అమీర్ అలీ ఖాన్ పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. 2024లోనూ ఈగల్ ఫోర్స్ ఇలాంటి ఆపరేషన్ చేపట్టి రాంచీ వరకు వెంబడించి 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. తాజాగా నిర్వహించిన హైరిస్క్ ఆపరేషన్‌పై ఒడిశా పోలీసులు ఈగల్ ఫోర్స్ బృందాన్ని అభినందించారు.

## బస్ భవన్ వద్ద టెన్షన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తమ సమస్యల పరిష్కారించాలని గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బస్‌భవన్ ఎదుట ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన టెన్షన్‌గా మారింది. ఆర్టీసీ యూనియన్ నాయకుడు థామస్ రెడ్డిని రౌండప్ చేసిన రిటైర్డ్ ఉద్యోగులు.. మీవల్లే మాకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. రిటైర్మెంట్ ఉద్యోగులను రోడ్డుమీదకు తీసుకువచ్చిన థామస్ రెడ్డి ఇవాళ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిస్టమ్, ప్రైవేట్ బస్సులు ఇవన్నీ జేఏసీ నాయకుల వల్లే వస్తున్నాయని ఆరోపించారు. యునియన్‌లో ఉన్న వారంతా రిటైర్మెంట్ అయినవారేనని వారు అటు రిటైర్మెంట్ ఉద్యోగుల వైపైనా ఉండాలి లేదా సర్వీసు ఉద్యోగుల వైపైనా ఉండాలి తప్ప మమ్మల్ని అడ్డుపెట్టుకుని దండుకోవద్దన్నారు. గుర్తింపు సంఘాల పేరుతో ఎన్నికలు నిర్వహించి కార్మికుల వద్ద డబ్బులు దండుకోవడం కోసమే జేఏసీ నాయకులు వస్తున్నారని ధ్వజమెత్తారు.

**ప్రభుత్వం కోసమే విలీనం:**

ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం పరం చేసేందుకే ఆర్టీసీ విలీనం చేస్తున్నారని విలీనాన్ని రిటైర్మెంట్ కార్మికులమంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఆస్తి అంతా తాము చేసిన సర్వీస్ ఫలితమే అన్నారు. తాము కార్పొరేషన్ డబ్బులు అడగడం లేదని మేము జమ చేసుకున్న మా డబ్బులు మాకు ఇవ్వమని మాత్రమే అడుగుతున్నామన్నారు. ఒక్కొక్క రిటైర్డ్ ఉద్యోగికి 5-10 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. రిటైర్డ్ అయి నాలుగేళ్లు అవుతున్నా మా డబ్బులు మాకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తే చిత్తుగా ఓడించి ఇంటికి పంపించామని ఇప్పుడు రేవంత్ రెడ్డి నమ్మించి గొంతుకోస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులను చేయడం కాదు రేవంత్ రెడ్డి కుటుంబమే కోటీశ్వరులుగా తయారవుతోందని విమర్శించారు. మహాలక్ష్మీ పథకం నడవడానికి ప్రధాన కారణం రిటైర్డ్ ఉద్యోగుల వాటా కూడా ఉందన్నారు. ఆర్పీఎస్ 2017, 2021 ఏరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు, గ్రాట్యుటీ బకాయిలు తదితర ఎన్నో సమస్యలు ఉన్నట్టు వాపోయారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా స్పందనలేదని, అందుకే ఇవాళ దీక్ష చేపట్టామన్నారు.



# ఈ క్యాబినెట్ కు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్యాబినెట్ విధానానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మంత్రివర్గ సమావేశాలు డిజిటల్ విధానంలో జరగనున్నాయి. దీనికోసం రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్ వేర్ రూపొందించారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో ఈ క్యాబినెట్ విధానం అమలులో ఉంది. దీని ఆధారంగా ఈ క్యాబినెట్ సొల్యూషన్స్‌ను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేస్తున్నారు. ఇందుకోసం నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ సర్వీసెస్ ఇన్ కార్పొరేటెడ్‌తో ప్రభుత్వం చర్చలు జరిపింది. అంతేకాకుండా ఈ క్యాబినెట్ అమలుకు టీజీటీఎస్‌ను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. ఈ ప్రాజెక్టు ప్రారంభానికి తొలివిడతగా రూ.20 లక్షల నిధుల విడుదలకు సైతం అనుమతిచ్చింది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రుల ట్యాబ్‌లు, కంప్యూటర్ల ద్వారా ఎజెండాలు, ఫైల్స్ వీక్షణ ఉంటుంది. ఈ నిర్ణయంతో క్యాబినెట్ నోట్స్, ప్రతిపాదనలు, నిర్ణయాలు పూర్తిగా డిజిటల్ రూపంలో అందుబాటులోకి రానున్నాయి. సమాచారం లీక్ అవ్వకుండా, సాఫ్ట్ వేర్ హ్యాక్ అవ్వకుండా ప్రత్యేక లాగిన్ ఐడీ, పాస్ వర్డ్స్‌తో సెక్యూరిటీకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. ఈ క్యాబినెట్ విధానంలో ఎక్కడ నుండి అయినా.. ఎప్పుడైనా కేబినెట్ ఎజెండాలను పరిశీలించే సౌకర్యం ఉంటుంది. దీంతో సమావేశాలకు ముందు, తరవాత ఫైళ్ల నిర్వహణ సులభతరం కానుంది. పరిపాలనలో వేగం, పారదర్శకత పెంచేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

**జూన్ 30న రైతు భరోసా నిధులు విడుదల**

జూన్ 30న రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా నిధుల విడుదలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మధిరలో జరిగే భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ ఈ నిధులను విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పథకం కింద మూడో విడత నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధం కావడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందిస్తోంది. ఎకరానికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున, యాసంగి సీజన్‌కు రూ.6వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. మొదటి విడతలో ప్రతి రైతుకు ఒక ఎకరం వరకు పెట్టుబడి సాయం అందించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల 11 వేల 947 మంది రైతులకు సాయం అందింది. దాదాపు రూ.5,653 కోట్లను నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులు ఉండగా, విడతల వారీగా అందరికీ సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం విదితమే. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రైతు భరోసా వంటి పథకాలను సమర్థవంతంగా తెలంగాణలో రేవంత్ సర్కార్ అమలు చేస్తుంది. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, పంటల సాగుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో రైతు భరోసా కీలక పాత్ర పోషిస్తుంది. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు మంత్రి ఉత్తమ్. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీజీ ఆర్ఏఎం జీపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ముదురుతున్న వర్గపోరు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొన్ని నియోజకవర్గాల్లో పాత, కొత్తతరం నేతలకు మధ్య గొడవలు తరుచుగా జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల సీనియర్ నేతలు, స్థానిక నేతలకు మధ్య పంచాయితీలు ముదిరి రోడ్డున పడుతున్నాయి. ఈ క్రమంలో ఈ వివాదాలు కాస్తా పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు వస్తున్నాయి. ఈ వివాదాలు పార్టీలో ఎంతోకాలంగా ఉండి మంత్రులుగా పనిచేసిన వారి కేంద్రంగా రావడం గమనార్హం. జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి జీవన్‌రెడ్డికి ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ మధ్య నెలకొన్న వివాదం చాలా రోజులు నడిచింది. పార్టీ రాష్ట్ర ముఖ్యులు వీరిద్దరి మధ్య సయోధ్యకి ప్రయత్నించినా వివాదం సద్దుమణగలేదు. చివరకు జీవన్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

**కామారెడ్డిలో సీనియర్ వర్సెస్ జూనియర్..**

కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి మధ్య వివాదం కొనసాగుతోంది. ఇక్కడ కూడా సీనియర్ నేత వర్సెస్ జూనియర్ నేతగా రాజకీయాలు నడుస్తున్నాయి. కామారెడ్డిలో కూడా రెండు వర్గాలుగా నేతలు విడిపోయి ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. వీరిద్దరి మధ్య వివాదం అనేక మలుపులు తిరిగి ప్రస్తుతం పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు చేరింది. రెండు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డికి కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. ఆయన వివరణ ఇచ్చారు. కాగా, షబ్బీర్ అలీ మాట్లాడినట్లుగా ఉన్న ఆడియో వెలుగులోకి రావడం ఆ వివాదంపై షబ్బీర్ అలీకి క్రమశిక్షణ కమిటీ వివరణ ఇవ్వాలని లేఖను పంపింది. ఈ లేఖకు వివరణ లేఖను షబ్బీర్ అలీ రాస్తూ ఆ ఆడియో నకిలీదని, మార్ఫింగ్ చేసిందని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు.

**వనపర్తిలో ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి..**

వనపర్తిలో నియోజకవర్గంలో కూడా ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీమంత్రి చిన్నారెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, పంచాయతీ ఎన్నికలు ఇరు నేతల మధ్య వర్గపోరును మరోసారి బట్టబయలు చేసింది. నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్‌కి అనుకున్న స్థాయిలో సీట్లు రాకపోవడానికి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేతనే కారణమంటూ పరోక్షంగా చిన్నారెడ్డిని ఉద్దేశించి మేఘారెడ్డి ఆరోపణలు చేయడంతో వీరిద్దరి మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. అయితే నేతల మధ్య వర్గపోరు, విభేదాలు స్థానికంగానే ఉన్నాయి. ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వానికి అనుకూలంగా కొనసాగుతున్న కొందరు నేతలకు స్థానికంగా ఉన్న నేతలు, గత ఎన్నికల్లో పార్టీ తరుఫున పోటీ చేసి ఓడిపోయిన వారికి మధ్య కూడా విభేదాలు నెలకొన్నాయి.

# కేంద్రం భారీ స్కెచ్

**న్యూ ఢిల్లీ :** భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అతి పెద్ద వ్యూహాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రచిస్తోందా అంటే రాజకీయవర్గాలు, అనలిస్టుల నుంచి అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఈ మధ్య జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో బీజేపీ బలం పెరగడం, దీనికి తోడు బెంగాల్లో దీదీని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలంతా మోదీకి అనుకూలంగా మారడం కేంద్రానికి కలిసివస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకుని ఇటీవల వీగిపోయిన బిల్లులను మళ్లీ పట్టాలెక్కించే పనిలో కాషాయవర్గం వ్యూహాలు రచిస్తున్న ట్టు ఢిల్లీ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇదే నిజమైతే ఉత్తర దక్షిణ భారతం మధ్య అతిపెద్ద అగాథం ఏర్పడనుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**రాజ్యాంగ సవరణతోపాటు..**

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన, లోక్సభ సీట్ల పెంపు అనేవి ప్రస్తుతం దేశ రాజకీయాల్లో అత్యంత హీట్ పుట్టిస్తున్న అంశాలు. ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో అవసరమైన మూడింట రెండు వంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. అప్పట్లో లోక్ సభలో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు వస్తే.. వ్యతిరేకంగా 230 ఓట్లు పడ్డాయి. ప్రత్యేక మెజార్టీకి కావలసిన 352 ఓట్ల మార్కు కంటే 54 ఓట్లు తక్కువ రావడంతో బిల్లు నిలిచిపోయింది, జులైలో జరగబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు లేదా ఆ తర్వాత కేంద్రం నిర్వహించబోయే ప్రత్యేక సమావేశాల్లో వీటికి చట్టరూపం ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

**అసలు వ్యూహం ఏంటి?**

కేంద్రం స్థానాల గరిష్ట సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి 850 సీట్లకు ద్రప్రభుత్వం ప్రతిపాదించిన చారిత్రాత్మక బిల్లు ప్రకారం.. లోక్సభరాష్ట్రాల నుండి 815, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 పెంచాలని భావిస్తు న్నారు. దీంతో పాటు 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే మహిళ లకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు అమలు చేయాలనేది మోదీ ప్రభుత్వ అసలు ప్లాన్. అయితే, ఈ బిల్లు మురిగిపోవడంతో మిత్రపక్షాలతో కలిపి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలు రచిస్తోంది. గత ఏప్రిల్లో ఎదురైన చట్టపరమైన పరాభవాన్ని అధిగమించడానికి బీజేపీ నాయకత్వం ఇప్పుడు తీవ్రంగా శ్రమిస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లు పాస్ కావాలంటే హాజరై ఓటు వేసే వారిలో 2/3 వంతు మెజార్టీ కచ్చితంగా ఉండాలి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత సీన్ మారుతోంది. ఇటీవల పశ్చిమ బెంగాల్కు చెందిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు మమతా బెనర్జీకి షాక్ ఇస్తూ ఎస్సీపీఐలో విలీనం కావడం.. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. వీరంతా కేంద్ర ప్రభుత్వానికి

**తీవ్ర అభ్యంతరాలు..**

ఈ బిల్లు వీగిపోవడానికి ప్రధాన కారణం ఉత్తరదక్షిణ రాష్ట్రాల మధ్య ఉన్న జనాభా వ్యత్యాసం, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టి సీట్లు పెంచితే., జనాభాను విజయవంతంగా అదుపు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్లో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నేతలు గట్టిగా వాదించారు. మహిళా రిజర్వేషన్లకు తాము అనుకూ లమే అయినప్పటికీ, దాన్ని డీలిమిటేషన్తో ముడిపెట్టడాన్ని తప్పుపడుతున్నట్టు తెలిపారు. రాబోయే సమావేశాల్లో ఈ ఆందోళనలను శాంతింపజేయడానికి ఏ రాష్ట్రానికీ సీట్లు తగ్గవు.. కేవలం అదనపు సీట్లు మాత్రమే యాడ్ అవుతాయనే గ్యారెంటీని చట్టంలోనే చేర్చాలని కేంద్ర భావిస్తున్నట్టు తెలుస్తోంది.

**పార్లమెంట్ సమావేశాలు ఎప్పుడు**

జకీయ వర్గాల అంచనాల ప్రకారం, జులై మొదటి లేదా రెండో వారంలో పార్లమెంట్ సాధారణ సభలు ప్రారంభం కానున్నాయి. అయితే, రాజ్యాంగ సవరణ కోసం కేంద్రం ప్రత్యేకంగా మూడు లేదా నాలుగు రోజుల ప్రత్యేక సమావేశాలను ఆగస్టు లేదా సెప్టెంబర్లో నిర్వహించే అవకా శాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును కేవలం మహిళా సాధికారత కోసమే కాకుండా, దేశ ఎన్నికల మ్యాప్ను మార్చే ఒక మాస్టర్ స్ట్రోక్ గా భావిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల చీలిక వంటి పరిణామాలు లోక్సభలో ప్రభుత్వానికి కొత్త బలాన్ని ఇచ్చాయి. ఒకవేళ వచ్చే ప్రత్యేక సమావేశాల్లో 2/3 వంతు మెజార్టీ మేనేజ్ చేసి కేంద్రం ఈ బిల్లును పాస్ చేయగలిగితే, అది భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చేయడం ఖాయం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**పార్లమెంట్ సమావేశాలు ఎప్పుడు**

జకీయ వర్గాల అంచనాల ప్రకారం, జులై మొదటి లేదా రెండో వారంలో పార్లమెంట్ సాధారణ సభలు ప్రారంభం కానున్నాయి. . అయితే, అయితే, రాజ్యాంగ రా సవరణ కోసం కేంద్రం ప్రత్యేకంగా మూడు లేదా నాలుగు రోజుల ప్రత్యేక సమావేశాలను ఆగస్టు లేదా సెప్టెంబర్లో నిర్వహించే అవకా ఎక్కువగా కనిపిస్తున్నాయని డిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును కేవలం మహిళా సాధికారత కోసమే కాకుండా, దేశ ఎన్నికల మ్యాప్ను మార్చే ఒక మాస్టర్ స్ట్రోక్ గా భావిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల చీలిక వంటి పరిణామాలు లోక్సభలో ప్రభుత్వానికి కొత్త బలాన్ని ఇచ్చాయి. ఒకవేళ వచ్చే ప్రత్యేక సమావేశాల్లో 2/3 వంతు మెజార్టీ మేనేజ్ చేసి కేంద్రం ఈ బిల్లును పాస్ చేయగలిగితే, అది భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చేయడం ఖాయం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**పార్లమెంట్ సమావేశాలు ఎప్పుడు**

రాజకీయ వర్గాల అంచనాల ప్రకారం. జులై మొదటి లేదా రెండో వారంలో పార్లమెంట్ సాధారణ సభలు ప్రారంభం కానున్నాయి. అయితే, రాజ్యాంగ సవరణ కోసం కేంద్రం ప్రత్యేకంగా ప్రత్యేకంగా మూడు లేదా నాలుగు రోజుల ప్రత్యేక సమావేశాలను ఆగస్టు లేదా సెప్టెంబర్ లో నిర్వహించే అవకాశాలు ఎక్కువగాకనిపిస్తున్నాయని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును కేవలం మహిళా సాధికారత కోసమే కాకుండా, దేశ ఎన్నికల మ్యాప్ను మార్చే ఒక మాస్టర్ స్ట్రోక్ గా భావిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల చీలిక వంటి పరిణామాలు లోక్సభలో ప్రభుత్వానికి కొత్త బలాన్ని ఇచ్చాయి. ఒకవేళ వచ్చే ప్రత్యేక సమావేశాల్లో 2/3 వంతు మెజార్టీ మేనేజ్ చేసి కేంద్రం ఈ బిల్లును పాస్ చేయగలిగితే, అది భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చేయడం ఖాయం అనే అభిప్రాయాలు వ్యకం అవుతున్నాయి.

# కుట్రలతోనే 2018లో ఓడా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేసినప్పుడు తనను ఓడించేందుకు కొందరు ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఇవాళ గుర్రంగూడలోని ఎకో పార్కులో ఆయన నాగలింగం మొక్కను నాటారు. రాష్ట్రంలో రూ.35.50 కోట్ల అభివృద్ధి పనులతో పాటు ఎకో పార్కులో రోబోటిక్ ఏనుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని అన్నారు.

**అందుకే ఎల్బీనగర్ అంటే ప్రేమ...**

మల్కాజ్‌గిరి ఎంపీగా తాను పోటీ చేసినప్పుడు ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలు తనకు 30 వేల ఓట్ల భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్‌లో తాను చేసిన పోరాటాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిందని, ఆ తర్వాత తాను వెనక్కి తిరిగి చూసుకోలేదని అన్నారు. ప్రజలంతా తనకు కొండంత అండగా నిలవడం వల్లే ఇవాళ ముఖ్యమంత్రిని కాగలిగానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి వస్తే తనకు సొంతూరుకు వెళ్లిన అనుభూతి కలుగుతుందని, అందుకే ఈ ప్రాంతంపై తనకు ప్రత్యేక అభిమానమని చాటుకున్నారు.

**కుట్రలతోనే 2018లో ఓడా..**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొందరి కుట్రల వల్ల కొడంగల్‌లో ఓడిపోయినప్పుడు, రేవంత్ రెడ్డి రాజకీయ జీవితం ముగిసిపోయిందని చాలా మంది నవ్వుకున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఆ ఓటమి నుంచి ఈ స్థాయికి చేరడానికి కారణమైన ఎల్బీనగర్ ప్రజల కోసమే నేడు ఇక్కడ 424 ఎకరాల భారీ విస్తీర్ణంలో అద్భుతమైన ఎకో పార్క్‌ను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని, కబ్జాదారుల భరతం పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనస్థలిపురంలో దేవుడి భూములను కబ్జా చేశారని కామెంట్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారి వీపులు సున్నం చేస్తామని సీఎం హెచ్చరించారు. భూ కబ్జాల వల్ల ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రాను తీసుకొచ్చామని పేర్కొన్నారు.

**ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు..**

ప్రస్తుతం ఢిల్లీ నగరం కాలుష్యంతో అల్లాడుతోందని, ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే ఉద్దేశంతోనే విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతున్నామని అన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి కొందరు అడ్డుపడుతున్నారని, అక్కడ నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి నదిని అభివృద్ధి చేస్తామంటే మోకాలడ్డుతున్నారని ఫైర్ అయ్యారు. దాదాపు 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ' కట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, తాము ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రతిపక్షాలు మళ్లీ పాత ఫార్మా కంపెనీలను తెస్తామంటూ అడ్డుపడుతున్నారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

# 'హైబ్రిడ్' పాలనలో రైతులకు దగా



**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసిందని, రైతులను దగా చేస్తూ 'రైతు బంధు' పథకానికి సంబంధించి మరోసారి కొత్త నాటకాలకు తెరలేపిందని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతును రాజు చేయాలనే సంకల్పంతో 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి, ప్రతి ఎకరానికి నీరందించేలా ప్రణాళికలు అమలు చేసిందని జగదీష్ రెడ్డి గుర్తుచేశారు. ముఖ్యంగా ఆలేరు, భువనగిరి ప్రాంతాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను తీసుకొచ్చి అద్భుతంగా నీరందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు బీమా', 'రైతు బంధు' పథకాలను పూర్తిగా అటకెక్కించిందని, పేరు మార్చి'రైతు భరోసా'అని పెట్టారు తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి భరోసా లేకుండా చేశారని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ బ్రహ్మాండంగా ఉంది. మేడిగడ్డ బారేజ్ అధికారిక స్థితితో సంబంధం లేకుండానే నీళ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.. ఈ దుర్మార్గపు ప్రభుత్వం కావాలనే కాళేశ్వరం నీళ్లను వాడుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు నీరిస్తే పంట ఎక్కువగా పండుతుందని, తాము ఇచ్చిన హామీ ప్రకారం బోనస్ చెల్లించి పంటను కొనుగోలు చేయాల్సి వస్తుందనే నెపంతోనే ఈ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడే ఈ ప్రభుత్వానికి రైతులు గుర్తుకొస్తారని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల ముందు, నిన్న సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఓట్ల కోసమే డ్రామాలు ఆడారని విమర్శించారు.మున్సిపాలిటీల్లో రైతుల ఓట్లు పోతాయనే భయంతో, ఎన్నికలకు ఒక్క రోజు ముందు కేవలం ఒక ఎకరానికి మాత్రమే నిధులు వేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఒక అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని, స్వయంగా లక్ష్మీనరసింహ స్వామిని సాక్షిగా పెట్టి దేవుళ్ల మీద ప్రమాణాలు చేసి కూడా ప్రజలను, రైతులను మోసం చేశారు. రుణమాఫీ చేస్తానని ఆ రోజు చేసిన ప్రమాణాన్ని కూడా ఇప్పటివరకు నిలబెట్టుకోలేదు" అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారంతూ పోలీసు శాఖ మాత్రమే పని చేస్తోందని, అది కూడా చట్టవిరుద్ధంగా నడుస్తోందని జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోలీసు అధికారులు అతిగా ప్రవర్తిస్తూ ప్రతిపక్ష నాయకులపై చట్టవ్యతిరేకంగా తప్పుడు కేసులు నమోదు చేయడం, బైండోవర్లు వేయడంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులందరిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

# రేవంత్ సర్కారుకు చుక్కెదురు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ పరిధిలోని రాయదుర్గం పరిధిలోని ఐటీ హబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనని పేర్కొంటూ ఎస్‌బీఐ యాజమాన్యం తెలంగాణ హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని రాయదుర్గం భూముల వేలంపై 3 వారాల పాటు స్టే విధించింది. అదేవిధంగా ఆ మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ఎస్బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**నిబంధనల ఉల్లంఘన వల్లే ఆ భూమి వేలానికి..**

కాగా, విచారణ సందర్భంగా కోర్టు హాల్‌లో ఇరుపక్షాల మధ్య వాడీవేడి వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ ధర్మాసనం ఎదుట గట్టిగా వాదనలు వినిపించారు. '2010లోనే రాయదుర్గంలోని సదరు భూమికి సంబంధించి అప్పటి టీజీఐఐసీతో ఎస్బీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం రెండేళ్ల కాలపరిమితిలోనే అక్కడ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఒప్పందం జరిగి దాదాపు 16 ఏళ్లు గడిచినా ఎస్బీఐ అక్కడ ఎలాంటి నిర్మాణ పనులను ప్రారంభించలేదు' అని ఏఏజీ కోర్టుకు విన్నవించారు. నిబంధనల ఉల్లంఘన వల్లే ఆ భూమిని వేలానికి పెట్టాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు.




**న్యాయమూర్తి తీవ్ర అసహనం..**

ఏఏజీ వాదనలపై స్పందించిన గౌరవ న్యాయమూర్తి తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ.. 'అసలు ఏ కారణంతో ఆ భూమిని వేలం వేశారు? అది ఎస్బీఐకి కేటాయించిన భూమి అని మీకు తెలీదా.. ఓ ప్రభుత్వ సంస్థ భూమిని ఇలా ఎలా వేలం వేస్తారు?" అని ఏఏజీని నిలదీశారు. అంతేకాకుండా, 'ఇలా భూములను వేలం వేస్తూ రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని పరుగులు పెట్టించాలనుకున్నారా?' అంటూ ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలపై ఏఏజీ కలుగజేసుకుంటూ కోర్టుకు వివరణ ఇచ్చారు. ఈ భూమిని వేలం వేయడం ద్వారా వచ్చే నిధులను ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తుందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు రాయదుర్గం వేలంపై 3 వారాల పాటు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# తెలంగాణ వ్యాప్తంగా భూ క్రయ విక్రయాలకు బ్రేక్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు భూ క్రయ విక్రయాలకు బ్రేక్ పడనున్నది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవలు షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సుమారు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ సర్వర్ నిర్వహణ పనుల ద్వారా సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమన్నారు. జూన్ 26న మొహర్రం, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించామన్నారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# సంపాదకీయం

## యుద్ధ విరామమా? లేక శాశ్వత పరిష్కారమా?



ప్రపంచ రాజకీయాల్లో కొన్ని సంఘటనలు ఒక దేశానికి మాత్రమే పరిమితం కావు. అవి మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి. మధ్యప్రాచ్యంలో నెలల తరబడి కొనసాగిన ఇరాన్--అమెరికా ఉద్రిక్తతల అనంతరం శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్త కూడా అలాంటి పరిణామాల్లో ఒకటి. ఈ ఒప్పందాన్ని పాకిస్తాన్ ప్రకటించడం, అనంతరం సంబంధిత పక్షాలు దానిని ధృవీకరించడం అంతర్జాతీయ దౌత్యరంగంలో ఆసక్తికర పరిణామంగా మారింది. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు కనిపించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద ఊరటగా భావించబడుతోంది. కానీ ఈ పరిణామాన్ని కేవలం రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంగా మాత్రమే చూడలేం. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, భౌగోళిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అంశం. అందుకే ఈ ఒప్పందం వెనుక ఉన్న వాస్తవాలను, దాని పరిమితులను, భవిష్యత్తు అవకాశాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు హోర్ముజ్ ఎందుకు అంత కీలకం?**

హోర్ముజ్ జలసంధి ప్రపంచ పటంలో ఒక చిన్న సముద్ర మార్గంలా కనిపించవచ్చు. కానీ దాని ప్రాముఖ్యత అపారమైనది. పర్షియన్ గల్ఫ్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు ప్రపంచ మార్కెట్లకు చేరే ప్రధాన ద్వారం ఇదే. ప్రపంచ చమురు సరఫరాలో గణనీయమైన భాగం, ద్రవీకృత సహజ వాయువు ఎగుమతుల్లో పెద్ద శాతం ఈ మార్గం ద్వారానే సాగుతాయి. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే ప్రభావం కేవలం ఇరాన్ లేదా గల్ఫ్ దేశాలకే పరిమితం కాదు. ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతాయి. పరిశ్రమల వ్యయాలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం అధికమవుతుంది. ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. ఇటీవలి నెలల్లో ఇదే జరిగింది. హోర్ముజ్‌లో ఉద్రిక్తతలు పెరగడంతో చమురు మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. సరఫరా అంతరాయాల భయం పెరిగింది. పెట్టుబడిదారులు ఆందోళన చెందారు. ఇంధన దిగుమతులపై ఆధారపడే దేశాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. భారత్ వంటి దేశాలకు ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. ఎందుకంటే దేశం వినియోగించే చమురులో అధిక భాగం దిగుమతుల ద్వారానే వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగితే అది రవాణా నుంచి వ్యవసాయం వరకు ప్రతి రంగంపై ప్రభావం చూపుతుంది. చివరకు సాధారణ ప్రజల జీవన వ్యయం పెరుగుతుంది.

**యుద్ధం ఎక్కడో జరుగుతుంది... ప్రభావం అందరిపై పడుతుంది**

ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచం ఒక విషయాన్ని పదేపదే నేర్చుకుంటోంది. ఒక ప్రాంతంలో జరిగే ఘర్షణ మరొక ఖండంలోని ప్రజల జీవితాలను కూడా ప్రభావితం చేయగలదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలో ప్రపంచ ఆహార భద్రత దెబ్బతిన్నట్లే, మధ్యప్రాచ్య ఘర్షణలు ప్రపంచ ఇంధన భద్రతను ప్రభావితం చేస్తున్నాయి. యుద్ధం అనేది ఇప్పుడు కేవలం సరిహద్దుల మధ్య జరిగే పోరాటం కాదు. అది సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది. పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది. మార్కెట్లలో అనిశ్చితిని పెంచుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిపై పరోక్ష ప్రభావం చూపుతుంది. అందుకే ఇరాన్--అమెరికా మధ్య శాంతి ప్రయత్నాలు కేవలం ఒక దౌత్య విజయం మాత్రమే కాదు. అవి ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశం.

**ఇది నిజమైన శాంతేనా?**

అయితే ఇక్కడే అత్యంత కీలకమైన ప్రశ్న మొదలవుతుంది. ఈ ఒప్పందం నిజంగా శాంతికి నాంది పలుకుతుందా? లేక రెండు పక్షాలు తమ వ్యూహాత్మక అవసరాల కోసం తీసుకున్న తాత్కాలిక విరామమా? ఇరాన్--అమెరికా సంబంధాల చరిత్రను పరిశీలిస్తే అవిశ్వాసమే ప్రధాన అంశంగా కనిపిస్తుంది. 1979 ఇరాన్ విప్లవం నుంచి ప్రారంభమైన విభేదాలు ఆంక్షలు, ప్రతీకార చర్యలు, ప్రత్యక్ష-పరోక్ష ఘర్షణల రూపంలో దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ చరిత్రను ఒక్క ఒప్పందం పూర్తిగా మార్చివేస్తుందని అనుకోవడం వాస్తవికత కాదు. అమెరికా ఈ ఒప్పందానికి అంగీకరించడం వెనుక కూడా అనేక కారణాలు ఉండవచ్చు. అంతర్జాతీయ విమర్శలు, ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఒత్తిడి, మిత్రదేశాల ఆందోళనలు, అంతర్గత రాజకీయ సమీకరణాలు - ఇవన్నీ నిర్ణయాన్ని ప్రభావితం చేసి ఉండవచ్చు. అదే సమయంలో ఇరాన్ కూడా తన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తోంది. ఆర్థిక ఆంక్షల ప్రభావం, ప్రాంతీయ రాజకీయ ఒత్తిడులు, అంతర్జాతీయ మద్దతు అవసరం వంటి అంశాలు దాని వ్యూహాలను ప్రభావితం చేస్తున్నాయి. అంటే ఈ ఒప్పందం పరస్పర నమ్మకంపై కంటే పరస్పర అవసరాలపై ఎక్కువగా ఆధారపడి ఉండే అవకాశం ఉంది.

**మధ్యప్రాచ్య రాజకీయాల సంక్లిష్టత**

మధ్యప్రాచ్యం ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన రాజకీయ ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ ప్రతి దేశానికి తనదైన భద్రతా ఆందోళనలు ఉన్నాయి. ప్రతి ప్రాంతీయ శక్తికి తనదైన వ్యూహాత్మక లక్ష్యాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక శాంతి ఒప్పందం కుదిరిందని మాత్రమే భావించి సమస్యలన్నీ ముగిశాయని అనుకోవడం సరైంది కాదు. ప్రాంతీయ శక్తుల మధ్య పోటీ, మతపరమైన విభేదాలు, సైనిక వ్యూహాలు, ఆర్థిక ప్రయోజనాలు ఇంకా అలాగే కొనసాగుతూనే ఉంటాయి. అంతేకాదు, మధ్యప్రాచ్యంలో ప్రతి శాంతి ప్రక్రియకు అనుకూల శక్తులతో పాటు వ్యతిరేక శక్తులు కూడా ఉంటాయి. ఒక ఒప్పందం కుదిరిందంటే దానిని నిలబెట్టుకోవడం మరో పెద్ద సవాలు.

**ప్రపంచ దేశాల బాధ్యత**

ఈ శాంతి ప్రక్రియ విజయవంతం కావాలంటే అది కేవలం ఇరాన్, అమెరికాలపై మాత్రమే ఆధారపడకూడదు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి, ప్రాంతీయ సంస్థలు, అంతర్జాతీయ దౌత్య వేదికలు కూడా చురుకైన పాత్ర పోషించాలి. ఎందుకంటే ఈ ఘర్షణల ప్రభావం అందరిపైనా పడుతోంది. ఇంధన సంక్షోభం రూపంలో, ధరల పెరుగుదల రూపంలో, ఆర్థిక అస్థిరత రూపంలో ప్రపంచం మొత్తం మూల్యం చెల్లిస్తోంది. శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు. అది స్థిరత్వం, పరస్పర విశ్వాసం, నిరంతర సంభాషణల ఫలితం. ఈ మూడు లేకుండా ఏ ఒప్పందమైనా కాగితంపై మాత్రమే మిగిలిపోతుంది. హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం ప్రపంచానికి ఒక శుభవార్త. ఇంధన మార్కెట్లకు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇది ఒక ఊరట. కానీ ఈ పరిణామాన్ని అతిశయోక్తిగా చూడడం ఎంత ప్రమాదకరమో, నిరాశావాదంతో చూడడం కూడా అంతే ప్రమాదకరం. ఇది ఒక అవకాశం. యుద్ధం నుంచి సంభాషణ వైపు అడుగేయడానికి లభించిన అవకాశం. దానిని శాశ్వత శాంతిగా మార్చాలా? లేక మరో ఘర్షణకు ముందు వచ్చే విరామంగా మిగల్చాలా? అన్నది సంబంధిత దేశాల రాజకీయ సంకల్పంపైనే ఆధారపడి ఉంటుంది. చరిత్ర మనకు ఒక పాఠం చెబుతుంది. యుద్ధాలు ప్రారంభించడం చాలా సులభం. కానీ వాటి పరిణామాల నుంచి బయటపడటం చాలా కష్టం. యుద్ధం చేస్తున్నది కొద్దిమంది నాయకులు కావచ్చు. కానీ దాని మూల్యం చెల్లిస్తున్నది ప్రపంచ ప్రజలందరూ. అందుకే ఈ శాంతి ఒప్పందం విజయవంతం కావాలని ప్రపంచం కోరుకుంటోంది. ఎందుకంటే హోర్ముజ్‌లో ప్రశాంతత నెలకొంటే అది కేవలం ఒక సముద్ర మార్గం తెరుచుకోవడం కాదు --- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ ప్రజలకు ఊపిరి పీల్చుకునే అవకాశం లభించడం.

# నెహ్రూ నుంచి మోడీ వరకు

భారతదేశ రాజకీయ చరిత్రలో నాయకుల గురించి జరిగే చర్చలు ఎప్పుడూ వ్యక్తుల చుట్టూ మాత్రమే తిరగవు. వారి కాలం, వారి నిర్ణయాలు, వారు నిర్మించిన వ్యవస్థలు, వారు వదిలి వెళ్లిన వారసత్వం చుట్టూ తిరుగుతాయి. అందుకే జవహర్‌లాల్ నెహ్రూ, నరేంద్ర మోడీ నాయకత్వాల మధ్య జరుగుతున్న పోలికను కేవలం రెండు వ్యక్తుల మధ్య పోటీగా చూడటం సరైన దృక్పథం కాదు. ఇది రెండు యుగాల మధ్య, రెండు భిన్న భారతదేశాల మధ్య, రెండు వేర్వేరు చారిత్రక అవసరాల మధ్య జరుగుతున్న పోలిక. ఎన్నికల విజయాలు, సభల్లో ప్రజాదరణ, అధికారంలో గడిపిన సంవత్సరాలు చరిత్రకు ఆసక్తికరమైన అంశాలే కావచ్చు. కానీ అవి తుది ప్రమాణాలు కావు. చరిత్ర అడిగే అసలు ప్రశ్నలు వేరే ఉంటాయి. ఒక నాయకుడు దేశానికి ఏ పునాది వేశాడు? ప్రజాస్వామ్యాన్ని ఎంత బలోపేతం చేశాడు? సంస్థలను నిర్మించాడా లేదా బలహీనపరిచాడా? భవిష్యత్ తరాలకు ఎలాంటి దేశాన్ని అందించాడు? అనే ప్రశ్నలకే చివరికి ప్రాధాన్యం ఉంటుంది.

**నెహ్రూ ముందున్నది దేశ పరిపాలన కాదు, దేశ నిర్మాణం**

1947లో స్వాతంత్ర్యం సాధించినప్పుడు భారతదేశం ఒక రాజకీయ యూనిట్‌గా ఏర్పడినా, అది ఇంకా ఒక సమగ్ర జాతి-రాజ్యంగా పూర్తిగా రూపుదిద్దుకోలేదు. విభజన హింస, కోట్లాది శరణార్థుల పునరావాసం, తీవ్ర పేదరికం, నిరక్షరాస్యత, పారిశ్రామిక వెనుకబాటుతనం, ఆహార కొరత, సంస్థాగత శూన్యత --- ఇవన్నీ కొత్త దేశాన్ని వెంటాడుతున్న సవాళ్లు. ఈ పరిస్థితుల్లో నెహ్రూ పాత్ర ఒక సాధారణ ప్రధానమంత్రిది కాదు. ఆయనకు దేశాన్ని నడిపించడం కంటే దేశాన్ని నిర్మించడం పెద్ద బాధ్యతగా మారింది. అందుకే నెహ్రూ యుగాన్ని అనేక చరిత్రకారులు "Nation Building Era"గా అభివర్ణిస్తారు. నేడు భారతదేశ సాంకేతిక, శాస్త్రీయ, వైద్య, పారిశ్రామిక రంగాల గురించి గర్వంగా మాట్లాడుతున్నప్పుడు, వాటి మూలాలను నెహ్రూ కాలంలో వెతకాల్సి వస్తుంది. IIT\T, AIIMS, శాస్త్రీయ పరిశోధనా సంస్థలు, అణుశక్తి కార్యక్రమం, భారీ ఆనకట్టలు, ఉక్కు పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు - ఇవన్నీ ఒక ఆర్థిక విధానపు భాగాలు మాత్రమే కాదు; అవి స్వావలంబన కలిగిన భారతదేశం కోసం రూపొందించిన దీర్ఘకాలిక వ్యూహంలో భాగాలు. నెహ్రూ దృష్టిలో వ్యక్తుల కంటే సంస్థలు ముఖ్యమైనవి. నాయకులు వస్తారు, పోతారు. కానీ బలమైన సంస్థలు ఉంటే దేశం నిలబడుతుందని ఆయన నమ్మకం.

**ప్రజాస్వామ్య ప్రయోగం విజయవంతమైందా?**

స్వాతంత్ర్యం అనంతరం ఆసియా, ఆఫ్రికా దేశాల అనుభవాన్ని పరిశీలిస్తే నెహ్రూ కాలం ప్రాముఖ్యత మరింత స్పష్టమవుతుంది. అనేక కొత్త దేశాలు సైనిక తిరుగుబాట్లు, నియంతృత్వ పాలనలు, రాజకీయ అస్థిరతల బారిన పడ్డాయి. కానీ భారతదేశం మాత్రం సార్వత్రిక ఓటుహక్కు ఆధారంగా ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టగలిగింది. ఇది కేవలం రాజ్యాంగం వల్ల సాధ్యపడలేదు. రాజకీయ నాయకత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం వల్ల సాధ్యమైంది. భావ ప్రకటన స్వేచ్ఛ, పార్లమెంటరీ చర్చలు, ప్రతిపక్ష హక్కులు, న్యాయవ్యవస్థ స్వతంత్రత, సమాఖ్య వ్యవస్థ- ఇవన్నీ నెహ్రూ రాజకీయ దృష్టిలో కేంద్ర స్థానాన్ని ఆక్రమించాయి. మహిళల హక్కుల విషయంలో కూడా ఆయన తీసుకున్న సంస్కరణలు తన కాలానికి చాలా ముందున్నవిగా భావించబడతాయి. హిందూ కోడ్ బిల్ ద్వారా మహిళల ఆస్తి, వారసత్వ, వివాహ హక్కులను విస్తరించే ప్రయత్నం భారత సమాజాన్ని ఆధునికీకరించే దిశగా ఒక కీలక అడుగు. మోడీ ముందున్నది నిర్మాణం కాదు, మార్పుకు వేగం ఇవ్వడం 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం. రాజ్యాంగ సంస్థలు స్థిరపడ్డాయి. అంతరిక్ష పరిశోధన నుంచి అణుశక్తి వరకు, సమాచార సాంకేతికత నుంచి ఉన్నత విద్య వరకు అనేక రంగాల్లో దేశానికి ఒక బలమైన పునాది ఏర్పడింది. అందువల్ల మోడీ ముందు ఉన్న సవాలు నెహ్రూ తరహాలో దేశ నిర్మాణం కాదు. ఇప్పటికే నిర్మితమైన వ్యవస్థను మరింత వేగంగా ముందుకు నడపడం. డిజిటల్ ఇండియా, యూపీఐ చెల్లింపు వ్యవస్థ, ప్రత్యక్ష లబ్ధిదారుల బదిలీ (DBT), జీఎస్‌టీ అమలు, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే ఆధునికీకరణ, స్టార్టప్ వ్యవస్థ అభివృద్ధి, సంక్షేమ పథకాల డిజిటలైజేషన్ వంటి రంగాల్లో మోడీ ప్రభుత్వానికి గణనీయమైన గుర్తింపు లభించింది. భారతదేశాన్ని ఒక "ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రపంచ శక్తి"గా ప్రతిష్ఠించాలన్న ప్రయత్నం కూడా ఆయన నాయకత్వానికి ప్రత్యేక లక్షణంగా చెప్పబడుతుంది. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం మరింత చురుకైన పాత్ర పోషించడంలో మోడీ వ్యక్తిగత రాజకీయ శైలి ప్రభావం ఉందని ఆయన మద్దతుదారులు వాదిస్తారు.

**అభివృద్ధి మాత్రమే సరిపోతుందా?**

అయితే చరిత్ర అభివృద్ధి గణాంకాలతో మాత్రమే తీర్పు చెప్పదు. ఒక దేశంలో ఎన్ని రహదారులు నిర్మించబడ్డాయన్నదానికంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత బలంగా ఉందన్నది కూడా అంతే ముఖ్యమైన ప్రమాణం. ఈ నేపథ్యంలో పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర సంస్థల స్వయం ప్రతిపత్తి, ప్రతిపక్షాల పాత్ర, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, సామాజిక సామరస్యం, మత ధ్రువీకరణ వంటి అంశాలపై జరుగుతున్న చర్చలను నిర్లక్ష్యం చేయలేం. ప్రజాస్వామ్యంలో విమర్శలు దేశ వ్యతిరేకతకు సంకేతాలు కావు. అవి వ్యవస్థ ఆరోగ్యానికి సూచికలు. అధికారాన్ని ప్రశ్నించే స్వరం ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం జీవించి ఉంటుంది. అధికారాన్ని ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడితే అభివృద్ధి ఉన్నా ప్రజాస్వామ్యం బలహీనపడే ప్రమాదం ఉంటుంది. అందుకే నెహ్రూ, మోడీ పోలికలో ఆర్థిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, ప్రజాస్వామ్య సంస్థల స్థితి కూడా అంతే ముఖ్యమైన అంశం.

**చరిత్ర చివరకు ఏం గుర్తుంచుకుంటుంది?**

చరిత్రకు ఎన్నికల ఫలితాల కంటే పెద్ద జ్ఞాపకశక్తి ఉంటుంది. అది అధికార కాలాన్ని మాత్రమే లెక్కించదు. ఒక నాయకుడు నిర్మించిన సంస్థలను, కాపాడిన విలువలను, సమాజంపై చూపిన ప్రభావాన్ని పరిశీలిస్తుంది. నెహ్రూ విషయంలో చరిత్ర ఆయనను దేశ నిర్మాణ శిల్పిగా గుర్తుంచుకునే అవకాశం ఉంది. మోడీ విషయంలో డిజిటల్ పరివర్తన, పరిపాలనా కేంద్రీకరణ, అభివృద్ధి వేగం, ప్రపంచ వేదికపై భారతదేశ స్థానం వంటి అంశాలు ప్రధాన చర్చాంశాలుగా మిగిలే అవకాశం ఉంది. కానీ చివరి తీర్పు ఒకే ప్రశ్న చుట్టూ తిరుగుతుంది: ఆ నాయకుడు భారత ప్రజాస్వామ్యాన్ని తనకు అందిన దానికంటే బలంగా తరువాతి తరాలకు అందించాడా? ఎందుకంటే నాయకులు శాశ్వతం కాదు. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. కానీ రాజ్యాంగం, స్వతంత్ర సంస్థలు, పౌర హక్కులు, ప్రజాస్వామ్య విలువలు మాత్రమే ఒక దేశానికి దీర్ఘకాలిక బలం. అందువల్ల నెహ్రూ-మోడీ పోలిక అనేది ఇద్దరు నాయకుల మధ్య రాజకీయ వాదం కాదు. అది భారతదేశం ఏ దిశగా ప్రయాణించింది, ఇకపై ఏ దిశగా ప్రయాణించాలి అనే జాతీయ ఆత్మపరిశీలన. చరిత్ర చివరకు ఎవరు ఎంతకాలం పాలించారనే దానిని కాదు, ఎలాంటి భారతదేశాన్ని వదిలి వెళ్లారనే దానినే తన తుది తీర్పుగా నమోదు చేస్తుంది.

# అభివృద్ధి చేరని చివరి మైలు

తెలంగాణ ఏర్పడి పదేళ్లకు పైగా గడిచింది. ఈ దశాబ్దంలో రాష్ట్రం అనేక రంగాల్లో ప్రగతి సాధించింది. ఐటీ, పారిశ్రామిక రంగాలు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, డిజిటల్ పాలన వంటి అంశాల్లో తెలంగాణ తరచూ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వాలు తమ విజయాలను గర్వంగా ప్రస్తావిస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి చిత్రానికి మరో ముఖం కూడా ఉంది. అది అటవీ ప్రాంతాల్లో, గిరిజన గూడెల్లో, వర్షాకాలంలో ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పల్లెల్లో కనిపించే కఠిన వాస్తవం. ఒకవైపు అత్యాధునిక వైద్య సదుపాయాలతో నగరాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు విస్తరిస్తుంటే, మరోవైపు ప్రసవ వేదనతో ఉన్న గర్భిణిని డోలీలో మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఇంకా కొనసాగుతుండటం మన అభివృద్ధి నమూనాపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ చేరలేకపోవడం, వాగులు దాటించేందుకు రోగులను భుజాలపై మోసుకెళ్లడం, మార్గమధ్యంలోనే ప్రసవాలు జరగడం వంటి ఘటనలు కేవలం వార్తలు కావు. అవి వ్యవస్థ వైఫల్యానికి ప్రతీకలు. ఆరోగ్యం రాజ్యాంగంలో ప్రత్యక్షంగా ప్రాథమిక హక్కుగా ప్రస్తావించకపోయినా, జీవించే హక్కులో అంతర్భాగంగా న్యాయస్థానాలు ఎన్నోసార్లు గుర్తించాయి. అయినప్పటికీ రాష్ట్రంలోని అనేక గిరిజన కుటుంబాలకు అత్యవసర వైద్యం ఇప్పటికీ అందని హక్కుగానే మిగిలిపోవడం ఆందోళనకరం. ఒక పౌరుడు నగరంలో పది నిమిషాల్లో అంబులెన్స్ సేవ పొందగలుగుతుంటే, మరో పౌరుడు అడవిలో గంటల తరబడి మంచంపై మోసుకెళ్లబడాల్సి వస్తే, అది కేవలం రవాణా సమస్య కాదు --- సామాజిక అసమానతకు నిదర్శనం. వర్షాకాలం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అనేక గిరిజన గ్రామాలు వానలు మొదలైతే దాదాపు ద్వీపాలుగా మారిపోతాయి. వాగులు ఉప్పొంగుతాయి.




రహదారులు బురదమయమవుతాయి. ఇదే సమయంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు విస్తరిస్తాయి. ఆరోగ్య అవసరం అత్యధికంగా ఉండే కాలంలోనే ఆరోగ్య సేవలు అత్యంత దూరమవడం ఒక విషాదకర వాస్తవం. ఈ సమస్యకు కారణం కేవలం రహదారుల లేమి మాత్రమే కాదు. అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత, సిబ్బంది ఖాళీలు, మందుల లభ్యత సమస్యలు, ఆధునిక పరికరాల కొరత పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. అత్యవసర రోగిని జిల్లా కేంద్రానికి తీసుకెళ్లమని చెప్పడం సులభం. కానీ అక్కడికి చేరే మార్గమే లేకపోతే ఆ సలహా ఎంతవరకు ఉపయోగకరం? ప్రభుత్వాలు తరచూ 108, 102 అంబులెన్స్ సేవలు, అమ్మ ఒడి వంటి పథకాలను ప్రస్తావిస్తాయి. అవి అవసరమైనవే. కానీ అంబులెన్స్ వెళ్లే రహదారి లేకపోతే సేవ ఎంత గొప్పదైనా ప్రయోజనం ఉండదు. పథకాల విజయాన్ని కేవలం బడ్జెట్ కేటాయింపులతో కాదు, చివరి గ్రామంలోని చివరి కుటుంబానికి అవి ఎంతవరకు చేరాయనే ప్రమాణంతో కొలవాలి. నిజానికి గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సంక్షోభానికి పరిష్కారం వైద్య శాఖ ఒక్కదాని చేతుల్లో లేదు. ఇది రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్, విద్యుత్, ఆరోగ్యం, స్థానిక పాలన వంటి అనేక రంగాలకు సంబంధించిన సమగ్ర సమస్య. శాశ్వత రహదారులు, మొబైల్ మెడికల్ యూనిట్లు, నది దాటే ప్రాంతాల్లో చిన్న వంతెనలు, గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక వైద్య సిబ్బంది నియామకం, టెలిమెడిసిన్ సేవల విస్తరణ వంటి చర్యలు ఒక సమగ్ర వ్యూహంలో భాగం కావాలి. ఒక రాష్ట్ర అభివృద్ధిని కేవలం జీడీపీ వృద్ధి, పెట్టుబడులు, ఐటీ ఎగుమతులతో మాత్రమే కొలవలేం. అత్యంత వెనుకబడిన పౌరుడికి అందుతున్న సేవలతో కూడా కొలవాలి. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి వైద్యం అందుబాటులో ఉండటం గర్వకారణమే. కానీ ములుగు అడవుల్లోని ఒక గిరిజన తల్లి సురక్షితంగా ప్రసవించలేకపోతే, ఆసిఫాబాద్‌లో ఒక చిన్నారి సమయానికి వైద్యం అందక ప్రాణాలు కోల్పోతే, ఆ అభివృద్ధి కథనం అసంపూర్ణంగానే మిగులుతుంది. అభివృద్ధి అంటే నగరాల్లో ఎత్తైన భవనాలు కాదు. అత్యవసర సమయంలో ఒక అంబులెన్స్ అడవిలోని చివరి గ్రామానికి చేరగలగడం. సంక్షేమం అంటే పథకాల ప్రకటనలు కాదు. ప్రాణాపాయంలో ఉన్న ఒక గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవడం. తెలంగాణ నిజమైన ప్రగతిని సాధించిందని చెప్పాలంటే, రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న గిరిజన గూడెంలో నివసించే పౌరుడికి కూడా అదే స్థాయి ఆరోగ్య భద్రత లభించాలి. అప్పుడే అభివృద్ధి అందరికీ చేరిందని చెప్పగలం.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# సీనియర్లైతే అంత అహంకారమా?

**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** ఉన్నత చదువులు చదివి, సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన విద్యార్థులు దారితప్పుతున్నారు. సీనియారిటీ అనే అహంకారంతో జూనియర్ల పాలిట రాక్షసులుగా మారుతున్నారు. తాజాగా ప్రతిష్టాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో చోటుచేసుకున్న ర్యాగింగ్ ఘటనే ఇందుకు సజీవ సాక్ష్యం.

**మెడికల్ కాలేజీల్లోనే ఈ వ్యాధి ఎక్కువ**

పిల్లలను ఉన్నత విద్యాసంస్థల్లో చేర్పించి, వారిని ఉన్నత స్థాయిలో చూడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి పంపిస్తే, అక్కడి క్యాంపస్ కలుషిత వాతావరణం వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. సొసైటీ ఎగైనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ సంస్థ విడుదల చేసిన స్టేట్ ఆఫ్ ర్యాగింగ్ ఇన్ ఇండియా 2022-24 నివేదిక దిగ్భ్రాంతికర వాస్తవాలను వెల్లడించింది. గడిచిన రెండేళ్ల వ్యవధిలో (2022 నుంచి 2024 మధ్య) దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ కారణంగా ఏకంగా 51 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా 1,900కు పైగా కళాశాలల నుంచి యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు 3,000కు పైగా ఫిర్యాదులు అందగా.. అందులో అత్యధికంగా 38.6 శాతం కేవలం మెడికల్ కాలేజీల నుంచే రావడం గమనార్హం.

**కలచివేస్తున్న గత స్మృతులు.. శ్రీవిద్య ఉదంతం**

ఇటీవలే వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీవిద్య అనే విద్యార్థిని సీనియర్ల ర్యాగింగ్ తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడింది. పద్మాక్షి హాస్టల్‌లో గౌరవం ఇవ్వడం లేదన్న చిన్న నెపంతో సీనియర్లు ఆమెను టెర్రస్ పైకి తీసుకెళ్లి ఎయిర్ చైర్ శిక్షలు వేశారు. ఇంటికి వెళ్లిన ఆ విద్యార్థిని ఎలుకల మందు తాగి ప్రాణాలు విడిచింది. ఈ ఘటనలో ఏడుగురు తృతీయ సంవత్సరం విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు.

**నిబంధనలు గాలికి..**

ర్యాగింగ్ అనేది చట్టపరంగా తీవ్రమైన నేరం. దీనికి పాల్పడిన వారికి సస్పెన్షన్, అడ్మిషన్ రద్దు, డీబార్‌తో పాటు జైలు శిక్షలు విధించే కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, విద్యార్థి సంఘాలు ఉండటం వల్ల ఈ సమస్య కొంత మేర బయటకు వస్తోంది. కానీ, కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో కళాశాల పరువు పోతుందన్న నెపంతో యాజమాన్యాలు ఇలాంటి ఘటనలను బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచుతున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులనే కాదు, ఫైనల్ ఇయర్ వచ్చే వరకూ ఏదో ఒక దశలో విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడుతూనే ఉన్నారు.

**ఉమ్మడి కృషితోనే అడ్డుకట్ట**

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను కట్టడి చేసేందుకు జాతీయ విద్యా మండలి ప్రత్యేకంగా యాంటీ ర్యాగింగ్ పోర్టల్‌ను నిర్వహిస్తోంది. విద్యార్థులు నిర్భయంగా ఇందులో ఫిర్యాదు చేయవచ్చు. అయితే, కేవలం కఠిన చట్టాలు ఉంటేనే ఈ రక్కసిని అరికట్టలేం. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు కాగితాలకే పరిమితం కాకుండ క్షేత్రస్థాయిలో పనిచేయాలి. కమిటీ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు క్యాంపస్‌లో స్పష్టంగా ప్రదర్శించాలి. హాస్టళ్లలో రాత్రివేళల్లో కఠిన పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా పెంచాలి. రెండు, మూడు నెలలకోసారి కౌన్సెలింగ్ సెషన్లు, సైకలాజికల్ సపోర్ట్ కార్యక్రమాలు నిర్వహించాలి. అన్నింటికీ మించి సీనియర్లు జూనియర్లను తమ తమ్ముళ్లు, చెల్లెళ్లుగా భావించేలా వారి ప్రవర్తనలో, ఆలోచనా ధోరణిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత అధ్యాపకులు, తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది.

**ఉస్మానియాలో 12 మందిపై వేటు**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. బీడీఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న జూనియర్ విద్యార్థులను ఫైనల్ ఇయర్‌కు చెందిన సీనియర్లు తీవ్రస్థాయిలో ర్యాగింగ్ చేశారన్న ఆరోపణలు నిజమని తేలడంతో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. బాధితుల ఫిర్యాదుతో కాలేజ్ ప్రిన్సిపాల్ సంజీవ్ సింగ్ యాదవ్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు సుల్తాన్ బజార్ పోలీసులు ఫైనల్ ఇయర్‌కు చెందిన 12 మంది విద్యార్థులపై తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కాలేజీ యాజమాన్యం ర్యాగింగ్‌కు పాల్పడిన ఈ 12 మంది విద్యార్థులను ఆరు నెలల పాటు కళాశాల నుంచి సస్పెండ్ చేసింది.

# జాయింట్ సర్వే పేరుతో జాప్యం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మదీనాగూడ పటేల్ చెరువు నిషేధిత బఫర్ జోన్‌లో 'లోటస్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్' సాగిస్తున్న అక్రమ నిర్మాణాల వ్యవహారంలో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పక్కా ఆధారాలతో ఫిర్యాదులు వస్తున్నా.. కళ్లముందే అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా.. 'జాయింట్ సర్వే' ముసుగులో చర్యలు తీసుకోవడంలో కాలయాపన చేస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో చెరువులు కబ్జాకు గురవుతూనే ఉన్నాయి.

**ఇరిగేషన్.. వెనకడుగు వేస్తోందా?**

లోటస్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్ నిర్మాణాలను హుస్సేన్ సాగర్ లేక్స్ డివిజన్ ఇరిగేషన్ అధికారులు 2026 జనవరి 23 న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అసిస్టెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్వయంగా స్థలాన్ని పరిశీలించారు. పటేల్ చెరువు బఫర్ జోన్ పరిధిని ఆక్రమించి కాంపౌండ్ వాల్, అపార్ట్‌మెంట్ పిల్లర్లు, స్లాబులను నిర్మించారని రికార్డుల సాక్షిగా తేల్చారు. ఈ ఆక్రమణలపై 'ఇరిగేషన్ యాక్ట్ 1357 ఎఫ్' లోని క్లాజ్-52 ప్రకారం తక్షణమే నోటీసులు జారీ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి తహసీల్దార్, మియాపూర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, హైడ్రా కమిషనర్‌కు అధికారిక లేఖలు (ఎల్ఆర్ నం. 139, తేదీ 07.02.2026) పంపారు. లేఖలు పంపి నెలలు గడుస్తున్నా.. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**జాయింట్ సర్వే పేరిట**

'పటేల్ చెరువు బఫర్ జోన్ ఆక్రమణలపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. మేము ప్రాథమికంగా పరిశీలించాం. అయితే, ఇరిగేషన్ శాఖకు నేరుగా కూల్చివేతలు చేపట్టే అధికారాలు లేవు. అందుకే రెవెన్యూ, టాస్క్ ఫోర్స్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు లెటర్లు రాశాం. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో కలిసి 'జాయింట్ సర్వే' చేసి, ఆక్రమణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఇరిగేషన్ అధికారులు గతంలోనే ప్రకటించారు. కానీ ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ను పక్కన పెట్టి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డర్ చేతిలో 'ప్లాన్ అప్రూవల్' పెట్టేశారు. ఇప్పుడు ఇరిగేషన్ శాఖేమో మున్సిపాలిటీ, రెవెన్యూ వైపు వేలెత్తి చూపిస్తుంటే.. మున్సిపల్ అధికారులేమో ఇరిగేషన్ వారు జాయింట్ సర్వేకి పిలిస్తేనే వెళ్తామంటూ సాకులు వెతుకుతున్నారు. ఈ విధంగా ఒకరిపై ఒకరు నెపాన్ని వేసుకుంటూ కాలయాపన చేస్తుండటంతో, బిల్డర్ ఆ గ్యాప్‌లో అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేసి, అమాయక కొనుగోలుదారులకు ఫ్లాట్లను అప్పగించే పనిలో పడ్డారు.

**అధికారుల ఉదాసీనత..**

ప్రభుత్వ నిబంధనల (జీవో 168) ప్రకారం చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. చట్టం ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ఒక ప్రభుత్వ శాఖ ఆక్రమణలు జరిగాయని రాతపూర్వకంగా తేల్చినప్పుడు, జాయింట్ సర్వేల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఏముంది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మామూళ్ల మత్తులోనే అధికారులు కళ్లు మూసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమగ్ర సాక్ష్యాలు, అధికారుల లేఖల ఆధారంగా త్వరలోనే బాధ్యులైన అధికారులందరినీ కోర్టు బోనులో నిలబెట్టేందుకు బాధితులు, పర్యావరణ ప్రేమికులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కాలయాపన ముసుగును తొలగించి పటేల్ చెరువును కాపాడతారో లేదో వేచి చూడాలి.

# నీట్ నుంచి యూపీఎస్సీ వరకు..

**న్యూ ఢిల్లీ:** దేశంలో విద్యార్థుల కుటుంబాలపై పోటీ పరీక్షల నిర్వహణ, ప్రిపరేషన్ల పేరిట భారీగా ఆర్థిక భారం పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజస్థాన్‌లోని కోటాలో జరిగిన 'ఛాత్రోం కీ గూంజ్' ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, నీట్ నుంచి యూపీఎస్సీ వరకు వివిధ పోటీ పరీక్షల కోసం దేశంలోని కుటుంబాలు ఏటా ఏకంగా రూ.3.5 లక్షల కోట్లు వెచ్చిస్తున్నాయని కీలక వివరాలు వెల్లడించారు. ఈ దోపిడీ వ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని, ఇది దేశ ప్రజలకు జరుగుతున్న పెద్ద అవమానమని ఆయన విమర్శించారు.

**నీట్ పరీక్షకే రూ.1.32 లక్షల కోట్లు**

రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు రాసే నీట్ పరీక్ష




ప్రిపరేషన్ కోసం వారి కుటుంబాలు రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం విద్యా రంగానికి కేటాయించే బడ్జెట్ (సుమారు రూ.1.4 లక్షల కోట్లు) ఈ ఒక్క పరీక్ష కోసం ప్రజలు పెట్టే ఖర్చుకు సమానంగా ఉండటం గమనార్హం. ఎస్ఎస్సీ, యూపీఎస్సీ , జేఈఈ , ఆర్ఆర్బీ , నీట్ వంటి ఐదు ప్రధాన పరీక్షల కోసం కుటుంబాలు కలిపి రూ.3.5 లక్షల కోట్లు వెచ్చిస్తున్నాయి.' అని తెలిపారు. ఈ ఐదు పరీక్షల కోసం ప్రజల జేబుల నుంచి వెళ్తున్న రూ.3.5 లక్షల కోట్ల మొత్తం.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్య, ఆరోగ్యం, కార్మిక, సైన్స్, మహిళా-శిశు అభివృద్ధి శాఖల సంయుక్త బడ్జెట్‌తో సమానమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.'తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పొదుపు మొత్తాలను కరిగిస్తూ, అప్పులు చేస్తూ ఈ ఖర్చులను భరిస్తున్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ విద్యార్థులను ఆదుకునేలా కాకుండా, కేవలం డబ్బులు వసూలు చేసే ఒక 'దోపిడీ యంత్రాంగం'లా మారిపోయింది.' అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వివరాలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# త్వరలోనే పరిష్కారం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొంతకాలంగా వాయిదాపడ్డ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం తిరిగి బుధవారం గాంధీభవన్ లో ప్రారంభమైంది. మంత్రి అజారుద్దీన్ ఈ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతిపత్రాలు, అభ్యర్థనలను సమర్పించారు. భారీగా ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో, పలువురు ఓర్పుతో వేచి ఉండి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అజారుద్దీన్ స్వయంగా ప్రజలను కలుసుకుని వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించారు. ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలపైన జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, ఎస్పీలు, ఎంఆర్వోలు మరియు సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంక్షేమ పథకాలు, విద్య, పింఛన్లు, రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు, గృహాలు మరియు ఇతర పౌర సమస్యలకు సంబంధించిన అంశాలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ వివిధ సమస్యలతో ప్రజలు వచ్చారని, సుమారు 200 పైగా అప్లికేషన్స్ వచ్చాయన్నారు. తనకు సాధ్యమైనంత వరకు వచ్చిన పిటిషన్ పై అక్కడే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశానని, 50 పిటిషల సమస్యలకు వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించినట్లుగా అజారుద్దీన్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం సీఎం ఎంతో కష్టపడి పని చేస్తున్నారని, టీపీసీసీ చీఫ్ ప్రజలతో ముఖాముఖీ అనే మంచి కార్యక్రమం పెట్టారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నందున ఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, ఆధారాలు లేకుండనే, టెండర్ లో స్కామ్ అంటూ మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. పబ్లిక్ ని డైవర్ట్ చేయడానికే బీఆర్ఎస్ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని, ఫీజు రీఎంబర్స్మెంట్ పాపం గత ప్రభుత్వానిదని అజారుద్దీన్ ఆరోపించారు.

# తెలంగాణ వెదర్ రిపోర్ట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఎండలు మండిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో 30 నుండి 40 డిగ్రీలు ఆపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్య మధ్యలో వరణుడు వచ్చి బాయ్ చెప్పి వెళ్లిపోతుండటం, ఎండలు మండిపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇక ఈరోజు కూడా రాష్ట్రంలో ఎండల ప్రభావమే ఎక్కువ అని వడగాల్పులు వచ్చే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ బాలాజీ పేర్కొన్నారు. నార్త్ తెలంగాణలో 40 నుండి 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని తెలిపారు. దక్షిణ తెలంగాణలో 38 నుండి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు.అదే విధంగా ఈస్ట్ తెలంగాణ ప్రాంతాల్లో 39 నుండి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఇక రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు సైతం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నాగర్ కర్నూల్, వనపర్తి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణ్ పేట్, గద్వాల, నల్గొండ, సూర్యాపేట్, యాదాద్రి భువనగిరి, హన్మకొండ, వరంగల్, ములుగు, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాల్లో సాయంత్రం, రాత్రి సమయంలో వర్షం కురిసే ఛాన్స్ ఉందన్నారు. హైదరాబాద్ లోనూ సాయంత్రం, రాత్రి సమయంలో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు లైన్ క్లియర్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా చర్చల్లో ఉన్న సమ్మక్క-సారక్క బ్యారేజ్ (సమ్మక్క సాగర్) ప్రాజెక్టు మరోసారి వార్తల్లో నిలిచింది. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జరిపిన సమావేశం ప్రాజెక్టు భవిష్యత్తుపై కొత్త ఆశలు రేకెత్తించింది. ముఖ్యంగా ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన ఎన్ఓసీ జారీ విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్ల అనుమతుల ప్రక్రియలో ముందడుగు పడినట్లుగా అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా మారింది. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు--రంగారెడ్డి వంటి భారీ ప్రాజెక్టులతోపాటు పెండింగ్‌లో ఉన్న పాత ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాలనే దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.

**పాత ప్రతిపాదనకు కొత్త రూపం**

సమ్మక్క-సారక్క ప్రాజెక్టు ఆలోచన కొత్తది కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకం కింద ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) రెండో దశ ఆయకట్టుకు నీటి భద్రత కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం. 2009లో ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించగా, 2012లో కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాంకేతిక, ఆర్థిక అధ్యయనాల ఆధారంగా ప్రాజెక్టును పునఃరూపకల్పన చేశారు. మొదట ప్రతిపాదించిన కంతనపల్లి ప్రాంతానికి బదులుగా ములుగు జిల్లా తూపాకులగూడెం వద్ద బ్యారేజ్ నిర్మించాలని నిర్ణయించారు. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం కూడా గణనీయంగా తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

**4.40 లక్షల ఆయకట్టు స్థిరీకరణ**

రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని వినియోగించి ఎస్సారెస్పీ స్టేజ్-2 పరిధిలోని 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. సాగునీరు అందక ఇప్పటికే ఉన్న ఆయకట్టులో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితులు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు నీటి లభ్యత పెరిగి పంటల ఉత్పాదకత గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, జనగామ జిల్లాల్లోని లక్షల ఎకరాల భూములకు ప్రయోజనం కలగనుంది. ప్రస్తుతం సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది శాశ్వత పరిష్కారంగా మారే అవకాశం ఉంది. మరోవైపు.. రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించనున్నారు. ములుగు జిల్లాలో 8వేల ఎకరాలు, నర్సంపేట ప్రాంతంలో 22వేల ఎకరాలకు ఈ కాలువ ద్వారా నీరు చేరే అవకాశం ఉంది.

**దేవాదుల పథకానికీ మద్దతు**

జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టును స్థిరీకరించడంలోనూ ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న నీటిపారుదల పథకాలకు ఇది అనుబంధంగా పనిచేస్తుంది. దీంతో గోదావరి జలాల వినియోగ సామర్థ్యం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ బ్యారేజ్ నిర్మాణంతో వ్యవసాయానికే కాకుండా తాగునీటి అవసరాలను సైతం తీర్చనుంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందల గ్రామాలకు భవిష్యత్తులో తాగునీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత సమస్యను తగ్గించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

**ఎన్వోసీకి లైన్ క్లియర్**

ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న ప్రధాన అడ్డంకి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎన్వోసీనే. కేంద్ర జల సంఘంలోని హైడ్రాలజీ, వ్యయ అంచనాలు, భూగర్భ జలాలు, గిరిజన వ్యవహారాలు తదితర విభాగాల నుంచి ఇప్పటికే అనుమతులు లభించాయి. అయితే.. అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ తుది ఆమోదం కోసం ఛత్తీస్‌గఢ్ ఎన్వోసీ తప్పనిసరి అయింది. అందుకే.. ప్రాజెక్టు వల్ల ముంపు ప్రభావిత ప్రాంతాలపై రెండు రాష్ట్రాల ఇంజినీర్లు సంయుక్తంగా సర్వేలు నిర్వహిస్తున్నారు. సర్వే ఖర్చుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.9.883 కోట్లను విడుదల చేసింది. ముంపు ప్రభావిత భూములు గుర్తిస్తే చట్టప్రకారం పరిహారం చెల్లించేందుకూ తెలంగాణ ప్రభుత్వం సిద్ధమని ప్రకటించింది. రెండేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం నిరంతరంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నది. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం స్థాయిలో కూడా పలుమార్లు చర్చలు జరిగాయి. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ముందుకు రావడం వంటి పరిణామాలు ఎన్వోసీ త్వరలో లభించే అవకాశాలు లేకపోలేదు. ఎన్వోసీ లభించిన వెంటనే కేంద్ర జల సంఘం తుది పరిశీలన పూర్తి చేసి ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వనుంది. అప్పుడు సమ్మక్క-సారక్క బ్యారేజ్ నిర్మాణానికి ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి సైతం తొలగిపోతుంది.

# టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'..

**న్యూ ఢిల్లీ :** ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ ప్లాట్‌ఫామ్ ప్రస్తుతం నేరగాళ్లు, సైబర్ మోసగాళ్లు, తీవ్రవాద గ్రూపులకు సురక్షితమైన స్థావరం గా మారిందని, ఇది దేశంలో కొత్త డార్క్ వెబ్ రూపం దాల్చిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన ఓ అఫిడవిట్‌లో సంచలన ఆరోపణలు చేసింది. టెలిగ్రామ్‌లో నేరాల నియంత్రణపై దాఖలైన ఓ పిటిషన్‌కు సమాధానంగా కేంద్రం వివరాలను కోర్టు ఎదుట పెట్టింది.

**నీట్ పేపర్ల లీక్.. పరీక్షల అక్రమాలు**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ వంటి కీలకమైన పోటీ పరీక్షల క్వశ్చన్ పేపర్లు లీక్ కావడానికి, వాటిని అక్రమంగా సర్క్యులేట్ చేయడానికి టెలిగ్రామ్ ఛానెళ్లను విచ్చలవిడిగా ఉపయోగించారని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అదేవిధంగా అంతర్జాతీయ హ్యాకర్ గ్రూపులు సైబర్ దాడులను కో-ఆర్డినేట్ చేసుకోవడానికి, డేటాను మాయం చేయడానికి టెలిగ్రామ్‌ను వాడుతున్నారని పేర్కొన్నారు. దొంగిలించిన డేటాను పంచుకోవడానికి ఈ ప్లాట్‌ఫామ్‌ను వాడుతున్నారు. టెలిగ్రామ్ గ్రూపులు, క్లోజ్డ్ ఛానెళ్ల ద్వారా పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ , చైల్డ్ పోర్నోగ్రఫీ విపరీతంగా సర్క్యులేట్ అవుతోందని కేంద్ర ఢిల్లీకి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

**చట్టాల నుంచి తప్పించుకునే ఫీచర్లు..**

టెలిగ్రామ్‌లో మితిమీరిన ప్రైవసీ, ఇతర ఫీచర్ల వల్ల యూజర్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను సులభంగా దాచుకోగలుగుతున్నారు. దీంతో నేరస్తుల అసలు గుర్తింపును, వారి ఐపీ అడ్రస్‌లను కనుగొనడం దర్యాప్తు సంస్థలు పోలీసులకు తలకు మించిన భారం అవుతోందని అన్నారు. చివరగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటా ప్రకారం.. టెలిగ్రామ్ ద్వారా జరిగే సైబర్ మోసాల ఫిర్యాదులు రోజురోజుకూ భారీగా పెరుగుతున్నాయి. మనీలాండరింగ్ కోసం ఉపయోగించే మ్యూల్ బ్యాంక్ ఖాతాల విక్రయాలు కూడా ఓపెన్‌గా కొనసాగుతున్నాయని కేంద్రం చెప్పింది. టెలిగ్రామ్ కేవలం ఓ సాధారణ మెసేజింగ్ యాప్‌గా కాదని, డార్క్ వెబ్ ఫోరమ్‌లకు లింక్ చేసే డెంజరస్ నెట్‌వర్క్ మారిందని, ఇది దేశ భద్రతకు, పౌరుల ప్రైవసీకి పెద్ద ముప్పు పొంచి ఉందని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. తీజా పరిణామలతో నేపథ్యంలో కోర్టు టెలిగ్రామ్ యాప్‌పై నిషేధం విధిస్తుందా.. లేక గైడ్‌లైన్స్ సూచిస్తుందా అనేది సస్పెన్స్‌లా మారింది.



## ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టిన మరో వాహనం

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** అద్దంకి-నార్కెట్ పల్లి హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. చర్లపల్లి వద్ద గురువారం తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ఓ లారీ ఇటుకలు లోడ్ తో వచ్చి చర్లపల్లి వద్ద స్మశాన వాటిక ఆవరణలో నల్లగొండ వైపు వచ్చేలేన్ లో పక్కకు ఆపి కూలీలు ఆన్ లోడ్ చేస్తున్నారు. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ టైరు ఒక్కసారిగా పగిలిపోయి కుడి సైడ్ దూసుకుపోయి రోడ్డుకింద బోల్తాకొట్టింది. ఈ క్షణాల వ్యవధిలోనే నార్కెట్ పల్లి వైపు నుంచి కూల్ డ్రిక్స్ లోడుతో వస్తున్న మినీ డీసీఎం ఆన్ లోడ్ చేస్తున్న ఇటుకల లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ డీసీఎం క్యాబీన్ నుజ్జయింది. ఈ మూడు వాహనాలకు ఒక్కసారి ప్రమాదం జరిగినా కూలీలకు స్వల్పగాయాలే కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నల్లగొండ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

**మెదక్,ఫ్లాష్ ఇండియా :** రైతులు యాప్ ద్వారానే యూరియా బుక్ చేసుకోవాలని, జిల్లాలో ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకోవచ్చున్నారు. యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టాల్సిన అవ-సరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదని ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎర-ువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నకిలీ, నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని తెలిపారు.

# బుక్ చేసి 5 రోజులైనా రాని గ్యాస్..



**సంస్థాన్ నారాయణపురం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఎక్కడా లేని గ్యాస్ కొరత కేవలం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని లక్ష్మి నరసింహ భారత్ గ్యాస్ ఏజెన్సీలోనే కొనసాగుతోంది. గత రెండు సంవత్సరాలుగా గ్యాస్ కోసం మండల పరిధిలోని ప్రజలతో పాటు సదరు ఏజెన్సీలో కనెక్షన్ ఉన్న కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఇరాన్-అమెరికా యుద్ధం సాకు చూపి కొన్ని రోజులు ఏజెన్సీ నిర్వాహకులు కస్టమర్లను ముప్పుతిప్పలు పెట్టారు.

**గ్యాస్ బుక్ చేసిన నో డెలివరీ..**

లక్ష్మీనరసింహ గ్యాస్ ఏజెన్సీలో ఐదు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్న డెలివరీ చేయడంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేస-్తున్నారు. కస్టమర్ ఏజెన్సీ వద్దకు వచ్చి గ్యాస్ సిలిండర్ కోసం అడిగిన బుక్ చేసిన వెంటనే రాదని రెండు రోజుల తర్వాత రావాలని సూచించారు. రెండు రోజుల తర్వాత కస్టమర్ మళ్ళీ వెళ్తే నేడు గ్యాస్ స్టాక్ లేదని చెప్పారు. ఇలా ఒక్కో కస్టమర్లను రెండు నుంచి మూడు సార్లకు పైగా ఏజెన్సీ చుట్టూ తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తీరా వారం గడిచాక మొదట బుక్ చేసుకున్న బుకింగ్ క్యాన్సిల్ అయింది అని తిరిగి బుక్ చేసుకోవాలంటూ లైన్ లో నిలబడ్డ తర్వాత కస్టమర్లకు సూచిస్తున్నారు. ఇక్కడ గ్యాస్ కోసం కస్టమర్లు యుద్ధమే చేయాల్సి రావడం కస్టమర్లను తీవ్ర ఆవేదనకు గురిచేస్తుంది. గతంలో ఇక్కడ తోపులాటలో ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయిన ఇంకా గ్యాస్ ఏజెన్సీ నిర్వహణలో మాత్రం మార్పు రావడం లేదు.

**బ్లాక్ మార్కెట్‌కు తరులుతున్నాయని ఆరోపణలు!**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని గ్యాస్ ఏజెన్సీ నుండి సిలిండర్లు తమకు నచ్చిన వారికి ఇష్టానుసారంగా ఇస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వివిధ హోటల్,వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న వారికి గృహ వినియోగ సిలిండర్ లను అమ్ముతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. హోటల్ నిర్వాహకులకు బుక్ చేసుకున్న వెంటనే సిలిండర్లను ఇస్తూ సామాన్య కస్టమర్లను తీవ్ర ఇబ్బందుల గురి చేస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఇంకా కూడా గ్యాస్ ఏజెన్సీ నిర్వహణలో లోపాలను సవరించుకోకపోవడంతో ప్రస్తుత ఏజెన్సీ ని రద్దుచేసి మరొకరికి ఏజెన్సీ కేటాయించాలంటూ స్థానికులు కోరుకుంటున్నారు.

**తూతూ మంత్రంగా అధికారుల చర్యలు!**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ భారత్ గ్యాస్ ఏజెన్సీలో జరుగుతున్న ఇబ్బందుల పై వివిధ పత్రికల్లో కథనాలతో పాటు స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు తూతూ మంత్రంగా విచారణ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల వరుస కథనాల నేపథ్యంలో సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఏం జరిగిందోననే గుసగుసలు మండల వ్యాప్తంగా జోరుగా వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, సివిల్ సప్లై అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి గ్యాస్ ఏజెన్సీ నిర్వహణలో లోపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కస్టమర్లు కోరుకుంటున్నారు. ఇకనైనా కస్టమర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఇక వేచి చూడాల్సిందే.


# అరణ్య అర్బన్ పార్కును వర్చువల్ గా ప్రారంభోత్సవం చేసిన సీఎం

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిజామాబాద్ నగర శివారులో గల మాక్లూర్ మండలం చిన్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన అరణ్య అర్బన్ పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో గురువారం గుర్రంగూడ నుండి లాంఛనంగా ప్రారంభించారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అర్పన, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి. భుజంగ రావు, అదనపు డీసీపీ శుభం ప్రకాష్ నగ్రాలే, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తదితరులు అరణ్య అర్బన్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. సఫారీ వాహనంలో పర్యటించి అర్బన్ పార్క్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ లు, వాకింగ్ ట్రాక్, ప్లే జోన్ ఏరియా, కల్వర్టులు, పర-్కులేషన్ ట్యాంకులు, వాచ్ టవర్, సోలార్ ద్వారా నడిచే బోరుబావులు, రోడ్డు వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాన్ని కాపాడడానికి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు, ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచర-ణలో అటవీ శాఖ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చెట్లు నరకడం ఎంతో సులభం అని, కానీ పర్యావరణానికి, ప్రాణికోటికి ఎంతో మేలు చేకూర్చే మొక్కలు నాటి, వాటిని కాపాడడం గురించి ఎంతో మంది తమకు ఎందుకులే అని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి భాగస్వామ్యం ఉన్నప్పుడే, పచ్చదనం పెంపొందించబడుతుందని అన్నారు. జిల్లాలో అటవీ శాఖ పరంగా చేపట్టే కార్యక్రమాలకు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

**476 ఎకరాల విస్తీర్ణంలో అరణ్య అర్బన్ పార్క్**

ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 63వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని, నిజామాబాద్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే 476 ఎకరాల విస్తీర్ణంలో అరణ్య అర్బన్ పార్క్ ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దైనందిన కార్యకలాపాలతో అలసిన వారికి అర్బన్ పార్క్ ఆహ్లాదం పంచుతుందని, వ్యాయామం చేసుకునే వారికి మరింత వెసులుబాటు ఏర్పడిందని అన్నారు. అర్బన్ పార్క్ లో మరిన్ని వసతులు అందుబాటులో తెచ్చేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని అన్నారు. అర్బన్ పార్క్ లో అసాంఘిక శక్తులకు ప్రవేశం లేకుండా గట్టి నిఘా ఉంచాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంత సంరక్షణ, విస్తీర్ణం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. అడవులకు నష్టం కలిగించే వారి పట్ల అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న, డీఎఫ్ఓ సుధాకర్, సర్పంచ్ లు కే.లత, గంగాధర్, చిన్నా, విద్యార్థిని, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహ త్యాయత్నం



**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలంటూ నరేష్ చారి అనే వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో తీవ్ర కలకలం రేపింది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న వాటర్ ట్యాంక్ పైకి నరేష్ చారి హల్ చల్ చేశాడు. ఈ తరుణంలోనే రంగంలోకి దిగిన గద్వాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. శ్రీను, హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తన భార్యకు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బాలు నాయుడుతో అక్రమ సంబంధం ఉందని, దీనివల్ల తన కుటుంబం రోడ్డున పడిందని బాధితుడు నరేష్ చారి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించాడు. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా న్యాయం జరగకపోవడంతో మనస్థాపానికి గురై, చివరికి ఆత్మహత్యే మార్గమని భావించి ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు నరేష్ చారి తెలిపాడు.

**సీఐ కౌన్సిలింగ్‌తో ఉత్కంఠకు తెర**

సమాచారం అందుకున్న గద్వాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. శ్రీను వెంటనే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాటర్ ట్యాంక్ పైనున్న నరేష్ చారితో ఫోన్ ద్వారా మాట్లాడి, అతనికి ధైర్యం చెప్పారు. బాధితుడికి తప్పకుండా న్యాయం చేస్తామని, విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. సీఐ ఇచ్చిన హామీతో నరేష్ చారి వాటర్ ట్యాంక్ దిగి వచ్చాడు.



## బోయిగూడ యూపీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ

**సీతాఫలమండి,ఫ్లాష్ ఇండియా :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ సీతాఫల్‌మండి క్లస్టర్ పరిధిలోని బోయిగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, వివిధ రికార్డులు మరియు ఆసుపత్రి పరిశుభ్రత పరిస్థితులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే యూపిహెచ్సీ పరిధిలోని పేద ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు, వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్సలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వైద్య సేవల నాణ్యత పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలని డా.పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## నరసాపురంలో 300 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక

**దుమ్ముగూడెం,ఫ్లాష్ ఇండియా :** భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం దుమ్ముగూడెం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నర్సాపురం పంచాయతీలో భారీ చేరికల కార్యక్రమానికి హాజరై కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. చిన్న ఆర్లగూడెంలో ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క ఆగ్రోస్‌ను ప్రారంభించారు. నరసాపురం గ్రామంలో వీరమాచినేని సునీల్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సమక్షంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరిబాబు కొత్త సభ్యులకు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం చిన్న ఆర్లగూడెం, దబ్బనూతల గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. చిన్న ఆర్లగూడెం గ్రామంలో సమ్మక్క సారక్క ఆగ్రోస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండటం అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ఇటువంటి కేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమాల్లో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్లం హరిబాబు, ముర్రం వీరభద్రం, అన్నే సత్యాలు, పిలక వెంకటరమణారెడ్డి, లంక అబ్బులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క, కోదండరాంను కలిసిన ఆదివాసీ నాయకులు..



**పినపాక,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై తుడుందెబ్బ నాయకులు గురువారం మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తి రాజు, జాతీయ ఉపాధ్యక్షుడు కోడేం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించి ప్రస్తుతం రెండు గిరిజన సహకార సంఘాల మధ్య కొనసాగుతున్న వివాదాన్ని నిష్పాక్షికంగా పరిష్కరించాలని కోరారు. రెండు ఆదివాసీ సంఘాలకు సమన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పోడు భూముల సమస్యలు, గిరిజనుల జీవ-నోపాధి, ఏజెన్సీ ప్రాంతాల్లో వలసల ప్రభావం తదితర అంశాలను మంత్రి, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీగిరి లక్ష్మి ఇసుక క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు కూడా పాల్గొని వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించిన తమ సమస్యలను వారికి వివరించారు. గిరిజన హక్కులు, జీవనోపాధి, పోడు భూముల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారని గిరిజన నాయకులు తెలిపారు.



# నేను బాగా ఆడలేదు..



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్‌పై భారత మహిళల జట్టు 95 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. బుధవారం హెడింగ్లీ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ 17.3 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన 47 బంతుల్లో 74 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేసింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన స్మృతి.. లీడ్స్ మైదానం బ్యాటింగ్‌కు ఎంతో అనుకూలంగా ఉంటుందని చెప్పింది. వరుసగా రెండో అర్ధశతకం నమోదు చేసినప్పటికీ తన ఆటపై ఇంకా పూర్తి సంతృప్తి లేదని, తాను ఇంకా మెరుగుపడాల్సి ఉందని పేర్కొంది.'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైన స్మృతి మంధాన మట్లాడుతూ... 'నేను లీడ్స్ మైదానంలో గతంలో ది హండ్రెడ్ టోర్నీలో కొన్ని మ్యాచ్‌లు ఆడాను. ఈ వికెట్ ఎప్పుడూ బ్యాటింగ్‌కు బాగా సహకరిస్తుంది. అవుట్ ఫీల్డ్ కూడా చాలా వేగంగా ఉంటుంది. ఈరోజు నెదర్లాండ్స్ జట్టు కూడా బాగా ఆడింది' అని పేర్కొంది. టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి ఎదురైన నెదర్లాండ్స్ జట్టుపై ప్రత్యేకంగా ఎలా సిద్ధమయ్యారన్న ప్రశ్నకు స్మృతి ఆసక్తికర సమాధానం ఇచ్చింది. 'నెదర్లాండ్స్ జట్టు గురించి పెద్దగా అవగాహన లేదు. అందుకే వారి బౌలింగ్ విధానం, బలాబలాలపై అనేక వీడియోలు చూశాను. కానీ మేము ఎప్పుడూ ప్రత్యర్థిని తక్కువగా అంచనా వేయం. కొత్త జట్టైనా, టాప్ జట్టైనా ఒకే విధమైన గౌరవంతో బరిలోకి దిగుతాం. నెదర్లాండ్స్ ఫీల్డింగ్ చాలా బాగుంది. వారు మాకు మంచి పోటీ ఇచ్చారు' అని తెలిపింది.తన వ్యక్తిగత ఫామ్ గురించి మాట్లాడిన స్మృతి మంధాన.. 'నేను అనుకున్న స్థాయిలో ఆడలేదని అనిపిస్తోంది. నా ఆట ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. ఈరోజు షెఫాలీ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. ఆమె ఆటకు ఫిదా అయ్యా. మేమిద్దరం కలిసి మంచి భాగస్వామ్యం నిర్మించాం. షెఫాలీ మళ్లీ పరుగుల బాట పట్టడం జట్టుకు ఎంతో కీలకం. మెగా టోర్నీలో ఆమె ఇలానే ఆడాలని కోరుకుంటున్నా. షెఫాలీ ఆడితే జట్టుకు మంచి ఆరంభం దక్కుతుంది. అలానే నాపై కూడా ఒత్తిడి తగ్గుతుంది' అని చెప్పింది. అదేవిధంగా భారత బౌలర్ శ్రీ చరణి ప్రదర్శనను కూడా ప్రశంసించింది. 'శ్రీ చరణి అసాధారణంగా బౌలింగ్ చేసింది. నా దృష్టిలో ప్రతిరోజూ సరైన ప్రణాళికతో కష్టపడటం, సరైన పనులు చేయడం ముఖ్యమైన విషయం. తర్వాత మ్యాచ్‌లో ఫలితం ఎలా వస్తుందో చూద్దాం' అని పేర్కొంది. ఇప్పుడు భారత మహిళల జట్టు జూన్ 21న మాంచెస్టర్ వేదికగా దక్షిణాఫ్రికాతో కీలక పోరుకు సిద్ధవ-ువుతోంది. నెదర్లాండ్స్‌పై సాధించిన ఈ భారీ విజయం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.




# 2026లో కొత్త చరిత్ర..


ఫిఫా వరల్డ్ కప్ 2026 అద్భుతమైన ఆరంభాన్ని కొనసాగిస్తోంది. టోర్నమెంట్ ప్రారంభమైన కేవలం ఆరు రోజులకే ప్రపంచకప్ చరిత్రలో సరికొత్త రికార్డు నమోదైంది. జూన్ 16న జరిగిన 4 గ్రూప్ దశ మ్యాచ్‌లకు మొత్తం 2,81,223 మంది అభిమానులు హాజరై ప్రపంచకప్ చరిత్రలో ఒక్క రోజులో అత్యధిక ప్రేక్షకుల హాజరు రికార్డును సృష్టించారు.ఇంతకుముందు 1994 ఫిఫా వరల్డ్ కప్ సందర్భంగా జూన్ 28న నాలుగు మ్యాచ్‌లకు కలిపి 2,77,070 మంది ప్రేక్షకులు హాజరుకాగా.. అది ఇప్పటివరకు అత్యధిక రోజువారీ హాజరు రికార్డుగా నిలిచింది. ఇప్పుడు 2026 ప్రపంచకప్ ఆ రికార్డును అధిగమించి కొత్త మైలురాయిని చేరుకుంది. జూన్ 16న జరిగిన ఫ్రాన్స్-సెనెగల్, ఇరాక్-నార్వే, అర్జెంటీనా-అల్జీరియా, ఆస్ట్రియా-జోర్డాన్ మ్యాచ్‌లకు అభిమానులు భారీగా తరలివచ్చారు. స్టేడియాలన్నీ ప్రేక్షకులతో నిండిపోవడంతో ఫుట్‌బాల్ పండుగను తలపించే వాతావరణం నెలకొంది.టోర్నమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 13,09,652 మంది అభిమానులు మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రతి మ్యాచ్‌కు సగటున 65,483 మంది ప్రేక్షకులు హాజరవుతుండటం విశేషం. ఈ వేగం కొనసాగితే గ్రూప్ దశ ముగిసేలోపే 1994 ప్రపంచకప్‌లో నమోదైన 35 లక్షల మొత్తం ప్రేక్షకుల రికార్డు కూడా బద్దలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చారిత్రాత్మక ఘట్టంపై ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినో హర్షం వ్యక్తం చేశ-ారు. "ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక ప్రేక్షకులు హాజరైన రోజు ఇది. అభిమానులు తీసుకొచ్చిన ఉత్సాహం, రంగుల హంగులు, భావోద్వేగాలు ఈ టోర్నమెంట్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి" అని ఆయన అన్నారు. అలాగే, "ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏకం చేస్తుందనే విషయాన్ని ఫిఫా వరల్డ్ కప్ 2026 మ-రోసారి నిరూపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ ఆటపై ఉన్న ప్రేమను అభిమానులు తమ హాజరుతో చాటిచెప్పారు" అని అన్నారు.ప్రపంచకప్ మ్యాచ్‌లకు టికెట్లపై భారీ డిమాండ్ కొనసాగుతోందని ఫిఫా తెలిపింది. అభిమానులు టికెట్ల లభ్యత కోసం అధికారిక వెబ్‌సైట్‌ను తరచుగా పరిశీలించాలని సూచించింది. ప్రపంచకప్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఫిఫా లాభాపేక్ష లేకుండా ప్రపంచవ్యాప్తంగా పురుషులు, మహిళలు, యువత ఫుట్‌బాల్ అభివృద్ధికి వినియోగిస్తోంది. తమ 211 సభ్య దేశాల ఫుట్‌బాల్ కార్యక్రమాలకు ఈ నిధులను తిరిగి పెట్టుబడిగా మళ్లిస్తున్నట్లు ఫిఫా వెల్లడించింది.

# మెరవని రోనాల్డ్..

ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-కెలో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఒక ఊహించని ఫలితం నమోదైంది. బలమైన, స్టార్ ఆటగాళ్లతో కూడిన పోర్చుగల్ జట్టును పసికూనగా భావించిన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో జట్టు 1-1 గోల్స్ తేడాతో నిలువరించి సరికొత్త సంచలనం సృష్టించింది. ఏకపక్షంగా సాగుతుందనుకున్న ఈ పోరు, కాంగో ఆటగాళ్ల అసాధారణమైన దూకుడు ఫుట్‌బాల్ అభిమానులకు అసలైన మజాను అందించింది.సుమారు 52 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఫిఫా ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన కాంగో జట్టు, తన పునరాగమన తొలి మ్యాచ్‌లోనే మాజీ ఛాంపియన్ పోర్చుగల్‌కు ముచ్చెమటలు పట్టించి అందరి దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే పోర్చుగల్ జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట 6వ నిమిషంలోనే పోర్చుగల్ మిడ్‌ఫీల్డర్ జోవో నెవ్స్ అద్భుతమైన ఫీల్డ్ వర్క్ చేశాడు. సహచర ఆటగాడు పెడ్రో నెటో ఇచ్చిన పాస్ ను నైపుణ్యంగా అందుకున్న నెవ్స్, దానిని హెడర్ ద్వారా గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, పోర్చుగల్ ఆధిక్యంలోకి వెళ్లినప్పటికీ కాంగో డిఫెండర్లు ఏమాత్రం ఒత్తిడికి లోన-వ్వకుండా ప్రత్యర్థి దాడులను తిప్పికొట్టారు. ఈ క్రమంలోనే తొలి అర్ధభాగం ముగిసే సమయానికి కాంగో స్ట్రైకర్ 'విస్సా' మైదానాన్ని ఒక్కసారిగా ఊపేసాడు. అతను కూడా హెడర్ ద్వారా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేసి పోర్చుగల్‌కు ఊహించని షాక్ ఇచ్చాడు.రెండో అర్ధభాగంలో ఇరు జట్లు విజయం కోసం సర్వశక్తులూ ఒడ్డాయి. మైదానంలో 70 శాతానికి పైగా సమయం బంతి పోర్చుగల్ ఆటగాళ్ల ఆధీనంలోనే ఉ న్నప్పటికీ, కాంగో డిఫెన్స్ లైన్‌ను దాటి రెండో గోల్ సాధించలేకపోయారు. మ్యాచ్ మొత్తం మీద పోర్చుగల్ ఆటగాళ్లు గోల్ పోస్ట్ దిశగా కేవలం 3 షాట్లు మాత్రమే కొట్టగా, కాంగో ప్లేయర్లు 2 షాట్లు ఆడారు. ఆటలో తీవ్రమైన పోటీ కారణంగా రిఫరీ నలుగురు ఆటగాళ్లకు ఎల్లో కార్డులు జారీ చేయగా, అందులో ముగ్గురు పోర్చుగల్ ఆటగాళ్లే ఉండటం గమనార్హం.



# బిజినెస్



# పెట్రో ధరల తగ్గింపు ఉండదు

అమెరికా - ఇరాన్ దేశాల మధ్య యుద్ధానికి శాంతి ఒప్పందం కుదిరింది. దీంతో ప్రపంచదేశాలు ఊపిరిపీల్చుకుంటున్నాయి. శాంతి ఒప్పందం కుదుర్చుకున్న క్రమంలో.. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో భారత్ లో గత నెలలో పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గిస్తూ.. కేంద్రం ఎప్పుడెప్పుడు ప్రకటన చేస్తుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియాలో దీనిపై చర్చ కూడా జరుగుతోంది. తాజాగా ఇంధన ధరల తగ్గింపుపై కేంద్ర పెట్రోలియం, సహజవాయుశాఖ సహాయమంత్రి సురేష్ గోపి కీలక ప్రకటన చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రానద దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించలేమని ఆయనస్పష్టం చేశారు. ముడిచమురు సరఫరా పరిస్థితుల్ని సమీక్షించాకే ఇంధన ధరల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. చమురు కొనుగోలు, రవాణా, నిల్వలు, శుద్ధి ప్రక్రియలకు సమయం పడుతుందని తెలిపారు. దేశంలో ముడిచమురు లభ్యత, సరఫరా పరిస్థితుల్ని కేంద్రపెట్రోలియం శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, అవసరమైన సమయంలో ధరలపై కచ్చితంగా సమీక్ష చేస్తామన్నారు. అయితే.. ఇంధన ధరల నిర్ణయం కేవలం అంతర్జాతీయ ముడిచమురు ధరలతోనే ముడిపడి ఉ ండదని, విదేశీ మారకం విలువ, పన్నులు, రవాణా ఖర్చులు వంటి అంశాలు కూడా పరిగణలోకి వస్తాయన్నారు.

# అమెరికా-ఇరాన్ చారిత్రాత్మక డీల్..




అమెరికా-ఇరాన్ చారిత్రాత్మక శాంతి ఒప్పందం పశ్చిమాసియాలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా సరికొత్త ఆర్థిక విప్లవానికి నాంది పలికింది. ఇరు దేశాల మధ్య కుదిరిన MoUతో అంతర్జాతీయ వాణిజ్యానికి గుండెకాయ లాంటి హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం, అమెరికా నౌకాదళ దిగ్బంధనం తొలగిపోవడం వంటి పరిణామాలు గ్లోబల్ మార్కెట్‌ను చల్లబరిచాయి. ఫలితంగా, గతంలో $100 మార్కును దాటి ఉడికించిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో 1.13% క్షీణించి బారెల్‌కు $78.65 వద్దకు పడిపోయింది. అలాగే అమెరికన్ డబ్ల్యూటీఐ క్రూడ్ సైతం 2.20% తగ్గి బారెల్‌కు $75 వద్ద ట్రేడ్ అవుతోంది. తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతుల పైనే ఆధారపడే భారత్‌కు, ఈ ముడి చమురు ధరల పతనం ఊహించని వరంలా మారింది. ఈ అంతర్జాతీయ డీల్ వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు, సామాన్యుడికి చేకూరనున్న 5 ప్రధాన ప్రయోజనాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**1. పెట్రోల్, డీజిల్ ధరల ఉపశమనం**

హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా ఇటీవల భారత్‌లో కేవలం 10 రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు లీటరుకు సుమారు రూ. 7 వరకు పెరిగాయి. అంతర్జాతీయ నిపుణుల లెక్కల ప్రకారం.. బారెల్ ముడి చమురు ధర $1 పెరిగితే, దేశీయంగా లీటర్ ఇంధనంపై 50-60 పైసల భారం పడుతుంది. ఇప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు $80 దిగువకు పడిపోవడంతో, చమురు కంపెనీల ఉత్పత్తి మరియు రవాణా వ్యయం గణనీయంగా తగ్గనుంది. దీనివల్ల త్వరలోనే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది.

**2. ద్రవ్యోల్బణానికి (ధరల పెరుగుదలకు) బ్రేక్**

దేశంలో రవాణా రంగానికి డీజిల్ ధరలే కీలకం. ఇంధన ధరలు తగ్గినప్పుడు రవాణా ఖర్చులు (Freight Costs) అదుపులోకి వస్తాయి. దీనివల్ల నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయలు, పారిశ్రామిక ఉత్పత్తుల ధరలపై ఉన్న ఒత్తిడి తగ్గుతుంది. ముడి చమురు ధరల పతనం దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కూడా స్పష్టం చేసింది.

**3. తగ్గుముఖం పట్టనున్న దిగుమతి బిల్లు**

భారత్ ప్రస్తుతం ప్రతిరోజూ దాదాపు 50 లక్షల బారెళ్ల (5 Million Barrels) చమురును దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర ప్రతి $10 తగ్గితే.. భారత్ వార్షిక చమురు దిగుమతి బిల్లుపై సుమారు $13-15 బిలియన్ల (దాదాపు రూ. 1.1 – 1.3 లక్షల కోట్లు) భారం తగ్గుతుంది. దీనివల్ల దేశ విదేశీ మారక నిల్వలు సురక్షితంగా ఉంటాయి.

**4. రూపాయి బలోపేతం & కరెంట్ అకౌంట్ లోటుకు కట్టడి**

గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ, డాలర్‌తో పోలిస్తే రూ. 95 మార్కును దాటిన భారత కరెన్సీ (రూపాయి)కి ఈ చమురు ధరల తగ్గుదల పెద్ద ఊరటనిచ్చింది. చమురు కొనుగోళ్లకు తక్కువ డాలర్లు ఖర్చు అవ్వడం వల్ల రూపాయి తిరిగి బంప్ అవుతుంది. మరోవైపు, క్రూడ్ ధరలో ప్రతి $10 తగ్గుదలకు, దేశ జీడీపీలో కరెంట్ అకౌంట్ లోటు (CAD) దాదాపు 0.3% నుంచి 0.4%వరకు తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది.

**5. స్టాక్ మార్కెట్లకు ఊపు**

ముడి చమురు ధరలు తగ్గడం వల్ల చమురును ముడిసరుకుగా ఉపయోగించే పెయింట్స్, టైర్లు, ఏవియేషన్ (విమానయానం), సిమెంట్, లాజిస్టిక్స్, కెమికల్ కంపెనీల ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయి. వ్యయాలు తగ్గి లాభాలు పెరగడంతో ఈ రంగానికి చెందిన కంపెనీల షేర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది. ఫలితంగా భారతీయ స్టాక్ మార్కెట్లు (సెన్సెక్స్, నిఫ్టీ) భారీ లాభాల బాట పట్టేందుకు ఇది దోహదం చేస్తుంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు




ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా గ్యాస్ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. హైదరాబాద్లో కమర్షియల్ సిలిండర్ ధర రూ. 3.367కు గా ఉంది ఒక్కసారిగా గ్యాస్ ధరల పెంపుతో హోటల్ యజమానులు, క్యాటరింగ్ వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కొంతమంది హోటళ్లు కూడా మూసేసి ఇంట్లో కూర్చునే పరిస్థితి నెలకింది. మరీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు మాద్దాం

హైదరాబాద్: రూ. 994
వరంగల్: రూ. 1013
విశాఖపట్నం: రూ. 950
విజయవాడ: రూ. 966 50
గుంటూరు: 966.50




# బంగారం వెండి కొనేటోళ్లకు బిగ్ రిలీఫ్..

ఇరాన్ అమెరికా పీస్ డీల్ ఫైనల్ కి చేరుకుంటున్న వేళ ప్రపంచ వ్యాప్తంగా బులియన్ మార్కెట్లలో ఒడిదొడుకులకు బ్రేక్ పడింది. దీంతో క్రమంగా వాటి ధరలు తగ్గుతూ కొనుగోలుదారులకు బిగ్ రిలీఫ్ అందిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు రిటైల్ షాపింగ్ చేయటానికి ముందుగా తమ నగరాల్లోని అమ్మకపు ధరలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవటం చాలా మంచిది. జూన్ 18న బంగారం రేట్లు స్థిరంగా కొనసాగుతున్నాయి. జూన్ 17న హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ. 15వేల 110గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ. 13వేల 850గా మార్పులు లేకుండా కొనసాగుతోంది. గురువారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూన్ 18, 2026న దేశవ్యాప్తంగా కేజీకి రూ. 5వేలు తగ్గింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ. 2లక్షల 70వేలుగా ఉ ంది. అంటే గ్రాము దాదాపు రూ. 270 దగ్గర ఉంది.




# 'పెద్ది' సరికొత్త రచ్చ..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వచ్చిన వైవిధ్యభరిత చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం 2026 నాటి సౌత్ ఇండియా-లోనే నంబర్ వన్ గ్రాసర్‌గా నిలిచి సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అయితే, ఇప్పుడు ఈ సినిమా చూసిన ప్రేక్షకులకు, చూడబో-యే ఫ్యాన్స్‌కు చిత్ర యూనిట్ ఒక బిగ్ షాకింగ్ అండ్ క్రేజీ సర్ప్రైజ్ ప్లాన్ చేసింది. సాధారణంగా సినిమా విడుదలయ్యాక లెంగ్త్ ఎక్కువైతే సీన్లు కత్తిరించడం చూ-స్తుంటాం. కానీ 'పెద్ది' విషయంలో మాత్రం మేకర్స్ రివర్స్ గేర్ వేశారు. థియేటర్లలో ఈ చిత్రానికి వస్తున్న భారీ రెస్పాన్స్ చూసి, ప్రేక్షకులను మరింతగా ఎంటర్‌టైన్ చేయడానికి ఏకంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల సరికొత్త సీన్లను రేపటి నుంచే అదనంగా యాడ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అఫీషియల్ పోస్టర్‌ను కూడా పేరుతో విడుదల చేశారు.సినిమాకు అదనంగా జోడించబోయే ఈ కొత్త సీన్లకు సంబంధించిన సెన్సార్ ఫార్మాలిటీస్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయి. అంటే రేపటి నుంచి థియేటర్లలో సరికొత్త ఎడిటింగ్‌తో కూడిన 'పెద్ది' రన్ కాబోతోంది. ఏ ఆర్ రెహమాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో, రత్నవేలు విజువల్స్ తో కూడిన ఈ సరికొత్త సీన్లు థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త హై ఇస్తాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే ఈ అప్‌డేట్‌లో అసలైన ట్విస్ట్ ఏంటంటే.. సినిమాలో హీరోయిన్‌గా నటించిన జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని పాత సీన్లను ఎడిటింగ్‌లో తొలగించినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న కొన్ని సీన్లను లేపేసి, వాటి స్థానంలో మరింత ఎ మోషనల్ అండ్ ఇంట్రెస్టింగ్ గా ఉండే కొత్త డ్రామాను, సీన్లను రీ-ప్లేస్ చేశారనే టాక్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. కథ మరింత వేగంగా, ఆసక్తికరంగా సాగడానికే ఈ కీలక మా-ర్పులు చేసినట్లు సమాచారం. ఒకపక్క రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్న 'పెద్ది', ఇప్పుడు ఈ 6 నిమిషాల కొత్త సీన్ల తోడవ్వడంతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.




# రీసెంట్ బెస్ట్ ట్రైలర్ కట్ ఇదేనేమో

యష్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, ఈ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఎన్టీఆర్-హృతిక్ రోషన్ 'వార్ 2' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అసలు ఈ సినిమా ఎన్టీఆర్ ఎందుకు చేశాడా? అని టైగర్ ఫ్యాన్స్ కాస్త ఫీల్ అయ్యారు. కానీ, ఈసారి అదిరిపోయేలా ప్లాన్ చేశారు యష్ రాజ్ ఫిలింస్ వారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ అలియా భట్ ప్రధాన పాత్రలో 'ఆల్ఫా' అనే స్పై థ్రిల్లర్ తెరకెక్కించారు. YRF స్పై యూనివర్స్' నుండి వస్తున్న మొట్టమొదటి లేడీ ఓరియెంటెడ్ స్పై ఫిల్మ్ కావడంతో ఈ మూవీ ఎలా ఉండబోతుందా? అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసి అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లారు. ఈ మధ్య ఎంత పెద్ద సినిమా అయినా సరే.. ట్రైలర్‌తోనే ఓ అంచనాకు వచ్చే-స్తున్నారు జనాలు. ఇప్పుడు ఆల్ఫా ట్రైలర్ మాత్రం నెక్స్ట్ లెవల్లో ఉందనే చెప్పాలి. ఈ మధ్య కాలంలో ఇలాంటి ట్రైలర్ కట్ రాలేదన్నట్టుగా ఉంది. హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకులను కట్టిపడేసేలా ట్రైలర్ కట్ చేశారు. అలియా భట్ చేసిన పవర్‌ఫుల్ స్టంట్స్, యాక్షన్ ఎపిసోడ్స్ హైలెట్‌గా నిలిచాయి. ఆమెకు తోడుగా మరో యంగ్ బ్యూటీ శార్వరి కూడా అదిరిపోయే యాక్షన్‌తో అదరగొట్టింది. బాబీ డియోల్ తనదైన విలనిజం మెప్పించారు. అయితే, ఈ ట్రైలర్‌లో అదిరిపోయే సర్‌ప్రైజ్ ఏంటంటే.. హృతిక్ రోషన్ క్యామియో రోల్. అలాగే.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంది. కాగా వచ్చే జూలై 3న 'ఆల్ఫా' థియేటర్లలో విడుదల కానుంది. మొత్తంగా.. రెండున్నర నిమిషాల ట్రైలర్ మాత్రం అదిరిపోయిందనే చెప్పాలి.




# మ్యూజికల్ జర్నీ షురూ..




వైవిధ్యమైన పాత్రలతో వరుస విజయాలతో దూ-సుకుపోతున్న శ్రీవిష్ణు నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ళ దర్శకత్వంలో రాబోతుండగా.. ఇందులో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయె కీలక పాత్రలో కనిపించనున్నారు. 1992 సంవత్సరంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శ్రీవిష్ణు డబుల్ రోల్ చేయనున్నట్లు టాక్. వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్న ఈ సినిమాకు కొణ వెంకట్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆయనకు వీరభిమానిగా శ్రీవిష్ణు కనిపించనున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మొదటి పాటను విడుదల చేసేందుకు మేకర్స్ ముహూర్తం ఖరారు చేశారు. జూన్ 20న కామ్రేడ్ కళ్యాణ్ ఫస్ట్ సింగిల్ 'ఒరియాపిల్ల" సాంగ్ రాబోతున్నట్లు తెలుపుతూ.. ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న హీరోయిన్ మహిమా నంబియార్ చుట్టూ, హీరో శ్రీవిష్ణు దండం పెడుతూ ప్రేమగా చూస్తున్న విజువల్ ఎంతో ఆకట్టుకుంటోంది. ఈ పోస్ట్‌కు "హద్దులు, అడ్డంకులు లేవు.. కేవలం ప్రేమ మాత్రమే" అనే బ్యూటిఫుల్ క్యాప్షన్‌ను కూడా జత చేశారు.

# అదా శర్మ క్రేజీ పోస్ట్

'ది కేరళ' స్టోరీ సినిమాతో దేశవ్యాప్తంగా ఫుల్ ఫేమ్ రాబట్టుకుని సంచలనం సృష్టించిన అదా శర్మ.. రూట్ మార్చి వివాదాస్పద చిత్రాలతో తన పాపులారిటీని పెంచుకుంటున్నారు. ఇటీవల 'గవర్నర్' మూవీతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం సూపర్ వెల్లి, ది గేమ్ ఆఫ్ గిర్గిట్, హటక్ వంటి థ్రిల్లర్ సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, అదా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్ చేశారు. ఇందులో భాగంగా ఒక నెటిజన్ అదా శర్మను ఉద్దేశించి.. "మీరు మా ఫేవరెట్ నటి. మీ నటన ఎంతో సహజంగా, రియలిస్టిక్‌గా ఉంటుంది.మరి అలాంటప్పుడు మీరు మరాఠీ భాషలో 'కార్ల్ స్టోరీ', '1920', 'కొమ్డో' లాంటి శక్తివంతమైన సినిమాలు ఎందుకు చేయకూడదు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అదా శర్మ క్రేజీగా సమాధానమిస్తూ.. ఒక పెద్ద హింట్ ఇచ్చారు. జూన్ 18న ఉదయం 10 గంటలకు ఒక బిగ్ సర్‌ప్రైజ్ రాబోతోందంటూ పిల్లి ఎమోజీలతో పాటు నవ్వుతున్న ఎమోజీలను జత చేశారు. దాంతో ఆమె మరాఠీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతోందని, రేపు రాబోయే అప్‌డేట్ అదేనని ఫ్యాన్స్ గట్టిగా ఫిక్స్ అయిపోతున్నారు. మరికొందరు మాత్రం ఆమె నటించే సినిమాలకు సంబంధించిన అప్డేట్ అయి ఉండొచ్చని అంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో అదా శర్మ ఇవ్వబోయే ఆ సర్‌ప్రైజ్ ఏంటా అని నెటిజన్లు ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.





# 'భోగి'పై పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో శర్వానంద్ ఇప్పటివరకు కనిపించని మాస్ అవతారంలో ప్రేక్షకులను అలరించనున్నాడు. ఇప్పటికే ఈ చిత్రాన్ని ఆగస్టు 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో సినిమా షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసే పనిలో చిత్రబృందం నిమగ్నమైంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలోని క్లైమాక్స్ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయింది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చిన ఈ క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతుందని తెలుస్తోంది.ముఖ్యంగా ఈ సన్నివేశాన్ని శర్వానంద్ సింగిల్ టేక్‌లో పూర్తి చేసి యూనిట్ సభ్యులను ఆశ్చర్యానికి గురి చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఆ సన్నివేశం పూర్తయ్యాక సెట్లో ఉన్న దాదాపు 200 మంది సభ్యులు శర్వానంద్ నటనకు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్లైమాక్స్ సీన్ శర్వానంద్ కెరీర్‌లోనే అత్యుత్తమ సన్నివేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశముందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటివరకు ఫస్ట్ లుక్ పోస్టర్లను మినహాయిస్తే పెద్దగా అప్డేట్లు బయటకు రాకపోయినా, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి 'భోగి' చిత్రంతో శర్వానంద్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**